Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 19.09.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 16 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# వంద రోజుల్లో ఒరిగేదేమిటి?



ఒక ప్రభుత్వ పనితీరుకు వందరోజులు కొలమానం కాదు. ఈ తక్కువ వ్యవధిలో ఎవరి పని తీరును కూడా అంచనా వేయడం సముచితం కాదు.

## » ఇది పాలనా? లేక సినిమానా?
## » ఇంతలోనే అద్భుతాలు ఆశించగలమా?

**కొంత కాలం క్రితం అగ్రహీరోల సినిమాలు వందరోజులు ఆడితే సూపర్‌హిట్ అయినట్లు లెఖ్ఖ. ఇప్పుడు రోజులు పోయి సూపర్‌హిట్‌కు కలెక్షన్ల కొలమానం వచ్చిందనుకోండి. అలాగే సంవత్సరానికొకసారి పుట్టినరోజు చేసుకునేవాళ్ళు. ఇప్పుడు ప్రతినెల పుట్టినతేదీలో పండుగ చేసుకునేవాళ్ళు వున్నారు. గతంలో దంపతులు భర్తకు 60ఏళ్లు వచ్చాక మళ్ళీ పెళ్లంటూ షష్టిపూర్తి చేసుకునేవాళ్ళు. ఇప్పుడు ప్రతి సంవత్సరం వివాహ వార్షికోత్సవాలు జరుగుతున్నాయి.**

అలాగే గతంలో కేంద్రంలో గాని, రాష్ట్రాలలో గాని కొత్త ప్రభుత్వాలు ఏర్పడి ఏడాదయ్యాక గాని ఆ ప్రభుత్వాల పనితీరుపై అవగాహన వచ్చేది కాదు. కాని ఇప్పుడు వందరోజుల పాలన పూర్తికాగా జయాపజయాలపై తీర్పులిచ్చేస్తున్నారు వందరోజులు చాలా ఎక్కువ టైమన్నట్లు. ఈ వందరోజుల్లోనే ఏదో అద్భుతాలు జరిగిపోవాలన్నట్లు మీడియా కూడా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. వందరోజుల పాలనలోనే ఆ ప్రభుత్వాలు పాస్ అయినట్లా? ఫెయిలైనట్లా? అనేదానిపై చర్చావేదికలు కూడా పెట్టేస్తున్నారు. ఈ విపరీత పోకడలు ఇటీవల ఎక్కువవుతున్నాయి. కొత్తగా పెళ్లయిన దంపతుల మధ్య ఒక అవగాహన కుదరడానికే కనీసం నెల రోజులు పడుతుంది. మరి కోట్లాదిమంది ప్రజలతో ముడిపడివున్న ఒక ప్రభుత్వ పరిపాలనపై అవగాహన తెచ్చుకోవడానికి వందరోజులు సరిపోతాయా?

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పడి వందరోజులు దాటింది. ఇప్పుడే ఆయా రాష్ట్రాలలో ఉపఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. యూపీ, రాజస్థాన్‌లలో బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. దీనిని మోడీ పాలనపై రెఫరెండంగా మీడియా ఊదరగొట్టింది. మోడీ పరిపాలనకు ఆ రాష్ట్రాలలో ఫలితాలకు ఏమన్నా సంబంధముందా? దేశంలో 60ఏళ్లుగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని, అవినీతిని వందరోజులలోనే రూపుమాపి ఈ దేశాన్ని అమెరికాలాగా, జర్మనీ, జపాన్‌లాగా తయారు చేయడానికి వందరోజులు సరిపోతాయా? ఈ వందరోజుల్లో నరేంద్ర మోడీ ఎటువంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలు చేపట్టలేదు. కుళ్లిపోయిన వ్యవస్థలన్నింటిని గాడినపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా మోడీ విదేశాంగ విధానంపై ప్రపంచ దేశాలన్నీ కూడా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన (మిగతా 10వ పేజీలో)



"ఆంధ్రప్రదేశ్ నుండి ఎందుకు విడిపోయామా అని పదేళ్ల తర్వాత తెలంగాణవాళ్ళే బాధపడతారు"
... రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ నాయకులు దిగ్విజయ్‌సింగ్ చేసిన వ్యాఖ్య ఇది.

# 'టీ'కి ఎల్ అండ్ టి షాక్!

- నిజమవుతున్న దిగ్విజయ్ వ్యాఖ్యలు
- మెట్రోపై చేతులెత్తేసిన సంస్థ
- విభజనతో మొదటి దెబ్బ

**ఆ**రోజు దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నాయకులు మండిపడ్డారు. కాని ఆంధ్రప్రదేశ్ లేని తెలంగాణ బ్రతుకేంటో కొన్నేళ్లలోనే బయటపడబోతోంది. ఆ పరంపరలోనే తెలంగాణ రాష్ట్రానికి మొదటి షాక్ తగిలింది.

హైదరాబాద్ నగరంలో చేపట్టిన మెట్రో రైల్ ప్రాజెక్ట్ నుండి వైదొలుగుతున్నట్లు ఎల్ అండ్ టి సంస్థ ప్రకటించింది. ఇందుకు కారణాలను కూడా పేర్కొంటూ ఆ సంస్థ యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద లేఖ వ్రాసింది. హైదరాబాద్ ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా ఉన్నప్పుడు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య ఒప్పందం క్రింద మెట్రో ప్రాజెక్ట్ పనులు చేపట్టడానికి (మిగతా 10వ పేజీలో)






- సైరన్లు లేవు... సందడి లేదు
- శంకుస్థాపనలు లేవు... ప్రారంభోత్సవాలు లేవు

ఆరు నెలలుగా...

# కళతప్పిన నెల్లూరు

- ప్రగతి శూన్యం... ప్రజల్లో దైన్యం

**నెల్లూరుజిల్లాలో రాజకీయ సందడే లేకుండాపోయింది. మంత్రులు రావడం, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, అధికారులతో సమీక్షలు, ఆకస్మిక తనిఖీల వంటి హడావిడే లేదు. దీనికి కారణం జిల్లాకు సంబంధించిన రాజకీయ నాయకుడికి మంత్రి పదవి రాకపోవడమే.**


ఈ జిల్లాకు చెందిన విద్యావేత్త పి.నారాయణకు మంత్రి పదవి వచ్చింది. స్వతహాగా ఆయన రాజకీయ నాయకుడు కాదు. అందుకనే మంత్రిగా ఆ డాబు, దర్పం ప్రదర్శించలేకపోతున్నాడు. ఒక్కో జిల్లాకు ఒకరు లేదా ఇద్దరు, ముగ్గురు మంత్రులు కూడా ఉన్నారు. నెల్లూరుజిల్లా నుండి మంత్రిగా నారాయణ ఉన్నారు. ఇంతకుముందు ఏ మంత్రి అయినా తన సొంత జిల్లాకు నెలకొకసారన్నా వచ్చిపోతుండేవాడు. కాని నారాయణకు మాత్రం ఆ తీరిక లేకుండా పోయింది. చంద్రబాబుకు ఆయనే నమ్మినబంటు. కాబట్టి రాజధాని పరిశీలన కమిటీతో పాటు భూసేకరణ కమిటీ, ఋణమాఫీ కమిటీ... (మిగతా 10వ పేజీలో)

# చిన్న, మధ్య పరిశ్రమల ఏర్పాటుకు కృషి

## ఏపీఐఐసీ ఛైర్మెన్ కృష్ణయ్య

నెల్లూరుజిల్లా కావలి నియోజకవర్గంలో చిన్న, మధ్య పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మెన్ కృష్ణయ్య అన్నారు. సోమవారం కావలి పట్టణ పరిధిలోని మద్దూరుపాడు పారిశ్రామికవాడను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నపరిశ్రమల యజమానులు కలిసి ఛైర్మెన్‌తో మాట్లాడారు. మద్దూరుపాడులో 28 చిన్న పరిశ్రమలు ఉన్నాయని, గతంలో 24 గంటలూ విద్యుత్తు ఇస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. రాజధాని కమిటీ సభ్యుడు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కావలి నియోజవర్గం దగదర్తిలో ఎయిర్‌పోర్టు, బోగోలు మండలంలో అపాచి కంపెనీ, రామాయపట్నంలో ఓడరేవు వచ్చే అవకాశాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య, వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్, కె.వెంకటసత్యనారాయణ, జి.కిషోర్, ఎ.సుబ్బారావు, జి.యానాదిశెట్టి, ఎన్.శ్రీనివాసకిరణ్ పాల్గొన్నారు.

## పెంచలకోనలో 24 నుంచి
# శరన్నవరాత్రి మహోత్సవాలు



రాపూరు మండలం పెంచలకోనలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేది వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదిలక్ష్మి అమ్మవారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంతో అమ్మవారిని కన్నులపండువగా అలంకరించి విశేష పూజలు చేస్తారు. 24వతేది సాయంత్రం6.30గంటలకు కలశస్థాపన జరుగుతుంది. ఇదే రోజున అమ్మవారికి వైభవంగా గాయత్రి అలంకారం నిర్వహిస్తారు. అదేవిధంగా, 25న ఆదిలక్ష్మీ అలంకారం, 26న ధాన్యలక్ష్మి అలంకారం, 27న ధైర్యలక్ష్మి అలంకారం, 28న గజలక్ష్మి అలంకారం, 29న సంతానలక్ష్మి అలంకారం, 30న విజయ లక్ష్మి అలంకారం, వచ్చేనెల 1న విద్యాలక్ష్మి అలంకారం, 2న ధనలక్ష్మి అలంకారం నిర్వహిస్తారు 3వ తేది విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఉదయం 8.30 గంటలకు పారువేట ఉత్సవం, 9 గంటలకు శమీపత్ర పూజ నిర్వహించి, ఉదయం 10.30 గంటలకు కల్యాణం కన్నులపండువగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు జరిగే 25వ తేది నుంచి వచ్చేనెల 2వతేది వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి నవకలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు పల్లకీసేవ, ఆస్థాన సేవ, విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శనగవరపు శ్రీరామమూర్తి పేర్కొన్నారు. భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

సింహపురి సమాచారం

## కావలి ఆర్డీఓగా
# నరసింహం

నెల్లూరుజిల్లా కావలి ఆర్డీఓగా ఎంఎల్ నరసింహం సోమవారం బాధ్యతలు చేపట్టారు. కడపజిల్లా రాజంపేటలో సోమశిల భూసేకరణ డిప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తూ కావలి ఆర్డీఓగా నియమితులయ్యారు.

## ఆత్మకూరు ఆర్డీఓగా
# ఎం.వి.రమణ

నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఆర్డీఓగా ఎం.వి.రమణ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నాయుడుపేట నుంచి బదిలీపై ఆత్మకూరు వచ్చిన రమణకు ప్రస్తుత ఆర్డీవో కోదండరామిరెడ్డి, తహశీల్దారు బికె వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు.

## కృష్ణపట్నం పోర్టులో
# కంటైనర్లు, బైరైటీస్ ఎగుమతి


నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నంపోర్టులో ఆదివారం నౌకల నుంచి భారీస్థాయిలో కంటైనర్లు, బైరైటీస్ ఎగుమతి జరుగుతోంది. యుకేకి చెందిన ఎంవీ టైగర్ బ్రిడ్జ్ నౌక నుంచి 800 కంటైనర్లు, పనామా నౌక ఎంవీ మెర్సీ విజ్డమ్ నౌక ద్వారా 10వేల టన్నుల బైరైటీస్ ఎగుమతి చేస్తున్నారు. బొగ్గు దిగుమతికి పోర్టులో రెండు నౌకలు లంగరు వేశాయి. 1.65లక్షల టన్నుల ఐరన్‌వోర్ దిగుమతికి సోమవారం ఎంవీ ఏంజల్-11 నౌక లంగరు వేశాయి.

# కార్మిక్ సంఘ్ నూతన కార్యవర్గం

ఏపియస్ ఆర్టీసీ కార్మిక్ సంఘ్ నూతన కార్యవర్గాన్ని ఇటీవల నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలు ఒకటవ డిపోకు చెందిన సి.ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు రెండవ డిపోకు చెందిన వి.కృష్ణయ్య, విశాఖపట్నంకు చెందిన బిఎస్ఆర్ మూర్తి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.వై.నాయుడు, ప్రధానకార్యదర్శిగా ఎం.హరిబాబు(నెల్లూరు రెండవ డిపో), కార్యదర్శిగా సి.హెచ్.శ్రీనివాసులు రెడ్డి(ఆత్మకూరు), బి.ఉమామహేశ్వరరావు (చీరాల), కె.దులేప్ప, డి.మాల్యాద్రి, ఎ.నాగేశ్వరరావులను నియమించారు. బిఎంయస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముత్యాలు అధ్యక్షత వహించారు.

## స్మార్ట్ సిటీల జాబితాలో...
# నెల్లూరుకు స్థానం కల్పించాలి

## నల్లపరెడ్డి ప్రసన్న డిమాండ్



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పాశం సునీల్‌లను సత్కరిస్తున్న సర్పంచ్ రాఘవయ్య

కేంద్రప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీల జాబితాలో నెల్లూరుకు స్థానం కల్పించాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీల జాబితాలో నెల్లూరు లేకపోవడం బాధ కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోటలో ఈ నెల 13న జరిగిన వైఎస్సార్‌కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. రుణమాఫీ పేరుతో ప్రజలను ముఖ్యమంత్రి మభ్యపెడుతున్నారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. తమ పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను నెలరోజుల్లో నియమిస్తామని, పార్టీకి అనుబంధంగా చేనేత, మత్స్యకారుల కమిటీలు కూడా ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మధు, సర్పంచ్‌లు రాఘవయ్య, రాము, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా, జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమితులైన ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నేత నేదురుమల్లి పద్మనాభరెడ్డి వాకాడులోని తన నివాసంలో శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేదురుమల్లి ఉదయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, పెళ్ళూరు కోటేశ్వరరెడ్డి, చంద్రమౌళిరెడ్డి, యల్లంటి వెంకటసుబ్బారెడ్డి, కె.శ్రీనివాసులు తదితరులు వున్నారు.

## ముంబై జాతీయ రహదారి
# నాలుగులైన్లు అయ్యేనా?

రాష్ట్ర రాజధానితో రాయలసీమ నుండి వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ చెప్పడం జరిగింది. రాయలసీమకు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండే ముఖ్యమైన రహదారి ముంబై జాతీయ రహదారి. నెల్లూరు నుండి ఈ రోడ్డు రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు లింకుగా వుంటుంది. ఈ మూడు జిల్లాలవాళ్లు జాతీయ రహదారిలోకి వచ్చేందుకు అనువైన రహదారి ఇదే! ఇదే రోడ్డు అటు బళ్లారికి, ఇటు ముంబైకి కూడా అనువుగా ఉంటుంది. ముంబై రహదారిని నాలుగులైన్లుగా మార్చాలని గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిర్ణయించారు. ఈ రహదారిని జాతీయ రహదారుల జాబితాలోకి కూడా చేర్చడం జరిగింది. కాని ఇన్నేళ్లలో ఈ రోడ్డును నాలుగులైన్లుగా మార్చే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

రాష్ట్ర విభజన నేపథ్యంలో మూడు రాయలసీమ జిల్లాలను జాతీయ రహదారితో కలిపే ఈ రోడ్డుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రహదారిని నాలుగులైన్లుగా మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాయలసీమ వాసులకు ఇక హైదరాబాద్ కంటే ఏ.పి. రాజధానితోనే సంబంధాలుంటాయి. కాబట్టి ముంబై రహదారిని నాలుగులైన్లుగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాల్సివుంది.

## అగ్నిప్రమాద బాధితులకు...
# రెడ్‌క్రాస్ సాయం



కోవూరు మండలంలోని వేగూరు పల్లిపాళెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో, ఇల్లు కాలిపోయి, కట్టుబట్టలతో వున్న తాండ్ర బాబుకు రెడ్‌క్రాస్ డిసాస్టర్ రిలీఫ్ కిట్‌లను అందజేసి చేయూతనిచ్చారు. ఈ నెల 15న వంటసామగ్రి, దుస్తులు తదితర వస్తువులను ఆయనకు అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్, రెడ్‌క్రాస్ డిసాస్టర్ కన్వీనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఆర్‌సి కోఆర్డినేటర్ బి.స్వాములు, ఫీల్డ్ ఆఫీసర్ ఎం. సత్యనారాయణ, రెడ్‌క్రాస్ ఉద్యోగి గోన యాకోబ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణ సాయం కోసం 9553894364 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా వారు ఈ సందర్భంగా కోరారు.

# నేదురుమల్లి ఫౌండేషన్‌లో ఉద్యోగ మేళా

ప్రతి ఏటా నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 13న నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణంలోని రాంకుమార్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ స్థాయిలో ఉద్యోగ మేళా నిర్వహించారు. టీమ్ లీజ్ కంపెనీ సహకారంతో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 72 కంపెనీలతో ఈ సంస్థకు అనుబంధం వుందన్నారు. 15 లక్షల మంది నిరుద్యోగులు ఈ సంస్థ తరుపున ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.కోటేశ్వరరావు, రామారావు, మధుసూదన్‌రెడ్డి పోలేరమ్మ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మెన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# వైయస్సార్ పథకాలు కనుమరుగవుతున్నాయి

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు కనుమరుగవుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పొదలకూరు మండలంలోని తాటిపర్తి పంచాయితి, నల్లపాళెం, తాటిపర్తి, వరదాపురం, బత్తులపల్లి గ్రామల్లో పర్యటించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోనం బ్రహ్మయ్య, సర్పంచులు వావిళ్ల వెంకట రత్నమ్మ , బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి

## ఏకొల్లులో విద్యార్థుల ర్యాలీ

పర్యావరణానికి ప్రాణప్రదమైన ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలంటూ దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ పాఠశాల ఉపాధ్యాయుడు రవిప్రసాద్ మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బతింటే భూమి మీదకు నేరుగా అతినీలలోహిత కిరణాలు ప్రసరించి, ప్రమాదకరమైన జబ్బులకు కారణమవుతాయన్నారు. అన్ని విధాలా కాలుష్యాన్ని నివారించుకుని, ఓజోన్ పొరను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపిటిసి సభ్యుడు ఉదయ్, ఉపాధ్యాయిని వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కళ్లెం.. అభివృద్ధికి పట్టం

## - సిఎం నూరు రోజుల పాలనపై సోమిరెడ్డి ప్రశంస



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూరురోజుల పాలన పారదర్శకంగా, దేశమంతా గర్వపడేలా సాగుతోందని, ఆయన పాలనలో అవినీతికి కళ్ళెం పడిందని, అభివృద్ధికి పట్టం కడుతున్నారని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు పరిపాలనా తీరును వివరించారు. అవినీతిని అంతం చేసి, ప్రజల సంక్షేమానికి చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన కొనియాడారు. పోలవరం ప్రాజెక్టుకు వున్న ఆటంకాలు తొలగించారని, విద్యుత్‌ను 24గంటలూ సరఫరా చేస్తున్నారని, పింఛన్‌లు పెంచారని, ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 60 ఏళ్ళకు పెంచారని, రాష్ట్రానికి హీరో మోటార్‌కార్ల పరిశ్రమను తెచ్చారని, పారిశ్రామికంగా రాష్ట్రం ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఐ కాంగ్రెస్, వై కాంగ్రెస్ కలసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయని, అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఈ నూరు రోజుల్లోనే పరిపాలనను ఒక కొలిక్కి తెచ్చారని, గత పదేళ్ళలో విచ్చలవిడిగా జరిగిన దోపిడీకి అడ్డుకట్ట వేశారని ఆయన అన్నారు. సద్విమర్శలను తాము ఎల్లవేళలా స్వాగతిస్తామన్నారు. విమర్శలు నిర్మాణాత్మకంగా వుండాలని, విపక్షం నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వుండాలని, అంతే తప్ప లేనిపోని విమర్శలు చేయడం సముచితం కాదన్నారు. కష్టాల్లో వున్న ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించాలని, దేశవిదేశాల్లో సైతం గుర్తింపు వుండేవిధంగా మహోన్నతంగా రాజధానిని నిర్మించాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని, రైతులకు మంచి భవిష్యత్ వుండేలా చూడాలని, తలసరి ఆదాయం పెంచాలని, ప్రజల సంక్షేమం కోసం, అన్నిరంగాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాత్రనక, పగలనక అహరహం శ్రమిస్తుంటే అలాంటి సిఎంపై లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. నవ్యాంధ్ర నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని, కష్టాల్లో వున్న ప్రజలకు అందరూ అండగా నిలబడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, కిలారి వెంకటస్వామినాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, బద్దేపూడి రవీంద్ర, అన్నం దయాకరగౌడ్, మున్వర్, జలదంకి సుధాకర్, అసీఫ్ బాషా, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# వందరోజుల పాలన బోందలాగుంది

## - మాజీ ఎమ్మెల్యే ఆనం



ఆంధ్రరాష్ట్రంలో చంద్రబాబునాయుడు వందరోజుల పాలన పూర్తిగా నిరాశ మిగిల్చిందని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి విమర్శించారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్‌లో విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని విషయంలో ప్రభుత్వం తొందరపాటు ప్రదర్శించిందని, అంత అవసరం లేదన్నారు. ఈ వందరోజుల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ ఏ ఒక్కటీ నెరవేరలేదని, ఆయన ఐదు సంతకాలు వట్టి భూటకమేనని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు ఏసి సుబ్బారెడ్డి, జిల్లా నగర కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, పత్తి రవీంద్రబాబు, పిండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకుతో ప్రాణాలకు చేటు

## - ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి




పొగ త్రాగి మృత్యు ఒడిలోకి చేరుకోవద్దని, పొగత్రాగడం, పొగాకు నమలడం వల్ల అనవసరంగా తమ నిండు ప్రాణాలను చేజేతులా కాలరాసుకోవద్దని తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ వాస్కులర్ సర్జన్ ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి హితవు పలికారు. మంగళవారం అతిథి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాలులో నగర ప్రముఖులు, విలేఖరులతో మాట్లాడారు. పొగాకు వినియోగం వల్ల భారతదేశంలో సంవత్సరంలో 8 లక్షల మంది గంటకు వందమంది మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. పొగాకులో వుండే నికోటిన్ కిక్‌కు అలవాటు పడి పొగతాగ్రేవారు దానికి బానిసలవుతున్నారని తెలిపారు. దాదాపు 1.5 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఏడాది 55 వేల మంది స్కూల్ విద్యార్థులు పొగత్రాగడం అలవాటు చేసుకుంటున్నారన్నారు. పొగాకు వినియోగం వల్ల నరాలు, నాడీమండలం, రక్తనాళాలు దెబ్బతినడమే కాకుండా దాంపత్య జీవితానికి అనర్థాలవుతారన్నారు. రోజుకు పది సిగరెట్లు కాల్చే వారికి జీవిత ఆయుష్షులో ఒక నెల తగ్గిపోతుందని, నోటి క్యాన్సర్, అల్సర్, తదితర భయంకరమైన వ్యాధులకు గురౌతారన్నారు.

**సలహాలు** - ఉపాధ్యాయులు, డాక్టర్లు, విద్యార్థులు ప్రజల ముందు పొగత్రాగకుండా ఉండాలి. సినిమా హీరోలు, క్రీడాకారులు ప్రకటనల్లో పొగత్రాగకుండా నిషేధించాలి. పొగాకు ఉత్పత్తుల గురించి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు నిరోధించాలి. 18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదు. సిగరెట్ ప్యాకెట్ల మీద అపాయకరమైన సింబల్స్ ముద్రించాలి. యుఎస్ఎ మాదిరిగా ప్రభుత్వాలు ఒక నిమిషం యాడ్‌ని పొగాకుకు వ్యతిరేకంగా చిత్రించి ప్రదర్శించాలని సూచించారు.

ఈ సమావేశంలో నెల్లూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస తేజ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## వర్థమాన సమాజంలో...

# కళ్ళు జిగేల్ మనిపించే ఫాన్సీ ఐటమ్స్



నెల్లూరు నగరం టౌన్‌హాలు ఆవరణంలోని వర్థమాన సమాజం భవనం క్రింది ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ ఐటమ్స్ మహిళలను విశేషంగా ఆకట్టుకుని చూపరులకు కళ్ళు జిగేల్ మనిపిస్తున్నాయి. చిన్నారులకు, మహిళలకు అవసరమైన అన్ని రకాల చెవి రింగులు మొదలు ఫ్యాన్సీ నక్లెస్‌లు వరకు వివిధ డిజైన్‌లలో రాళ్ళతో పొందిక చేసిన చెప్పలేనన్ని ఐటమ్స్‌ను ప్రదర్శనకు విక్రయానికి ఉంచారు. సింహపురి మహిళలు అధిక సంఖ్యలో రావడంతో హాలు కిక్కిరిసింది. మరి కొన్నిరోజులు మాత్రమే సింహపురి మహిళలకు అవకాశం కల్పిస్తున్నది.

# ప్రత్యక్ష పరోక్ష పన్నులపై అవగాహన సదస్సు





ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం టౌన్‌హాలులోని వర్థమాన సమాజంలో ప్రత్యక్ష పరోక్ష పన్నుల పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఏ ఆమంచర్ల శంకరనారయణ మాట్లాడుతూ పన్ను ఎగవేత దారులను అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం చట్టాలను క్లిష్టతరం చేసిందన్నారు.దేశంలోని అన్ని బ్యాంకులూ, ఆర్థికరంగ విభాగాలలో జరిగే లావాదేవీలు ఆదాయ పన్ను శాఖ నిఘాలు ఉన్నాయన్నారు. పది లక్షల పైన లావాదేవీలు నిర్వహించే అన్ని పొదుపు ఖాతాల లావాదేవీలను పరిశీలించి పన్ను ఎగవేతను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సదస్సులో సిఏ సత్యనారాయణ, సిహెచ్ వెంకటేశ్వర్లు, జేవీ చలపతిరావు, సుజీత్‌జైన్, నెల్లూరుశాఖ ఛైర్మెన్ సిఏ కిరణ్ కుమార్ వివిధ వృత్తి, ఉద్యోగ, వ్యాపార వర్గాల వారు పాల్గొన్నారు.

# ముగిసిన గ్రిగ్ పోటీలు




నెల్లూరు నగరంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగిన 94వ గ్రిగ్ మెమోరియల్ క్రీడలు ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొని మాట్లాడుతూ విజేతలు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10లక్షలు విలువచేసే క్రీడా పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ ఇన్‌చార్జ్ డిఇఓ ఉషారాణి, మండల విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్, గ్రిగ్ నిర్వహణ కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# ఆశలవైపు అడుగులు



> పదేళ్ళ కాంగ్రెస్ పాలనలో వున్న అస్తవ్యస్త పరిస్థితిని సరిచేసుకుంటూ, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి మార్గం పట్టించడమంటే అంత సులువేమీ కాదు. సమస్యల సుడిలో వున్న అనేక రంగాలను గాడిలో పెట్టి రాష్ట్రప్రజల ఆకాంక్షల మేరకు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమంటే మాటలు కాదు. అందుకే సీఎం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

నవ్యాంధ్ర తొలిముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడి పాలనకు ఈ నెల 16వ తేదీతో నూరురోజులు పూర్తయింది. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో పరిపాలన అంతా అస్తవ్యస్తం కావడం, అనేక ప్రాధాన్యతగల రంగాలు సైతం అభివృద్ధికి నోచుకోక కుదేలైపోవడం, ప్రధానమైన విద్యుత్, సాగునీటి రంగాల పరిస్థితిని పట్టించుకునేవారు లేక అటు ప్రజలు, ఇటు రైతులు సమస్యల సుడిలో పడి విలవిలలాడిపోవడం, మరోవైపు విభజనతో రాష్ట్రంలో మరిన్ని గడ్డు పరిస్థితులు ఏర్పడడం.. మొత్తమ్మీద రాష్ట్రం అతలాకుతలంగా వున్న స్థితి.

అలాంటి పరిస్థితుల్లో కొత్త ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక, నాటి సంక్షోభాలను అధిగమిస్తూనే, ఈ నూరు రోజుల పాలనలో కొన్ని ఘనమైన పనులు సాధించుకోగలిగామనే చెప్పాలి. అందులో పోలవరం ఒకటి. అటు రైతాంగానికి, ఇటు ప్రజలకు ప్రాణప్రదమైన పోలవరంను సాధించుకోవడం ఒక మంచి పరిణామం. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపేలా కేంద్రాన్ని ఒప్పించి సాధించగలిగారు. అంతేకాదు, జూన్ 8వ తేదీ నాటికి రాష్ట్రంలో 22 మిలియన్ల యూనిట్ల విద్యుత్ కొరత వుండగా, దానిని పూర్తి స్థాయిలో అధిగమించి, రాష్ట్రాన్ని విద్యుత్ వెలుగులతో శోభాయమానం చేస్తున్నారు. అక్టోబర్ 2వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నివాస గృహాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే బృహత్కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. కేంద్ర ఇంధనశాఖ మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తదితర ఉన్నతాధికారులందరూ కలసి ఆ మేరకు విద్యుత్ ఒప్పందం చేసుకున్నారు కూడా. ఇది పూర్తిస్థాయిలో ఆచరణలోకి వస్తే రాష్ట్రానికి విద్యుత్ కొరత తీరినట్లే.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం పథకాలు రూపొందిస్తున్నారు. వ్యవసాయానికి తొలిసారిగా ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువత, మహిళారంగాల్లో సంక్షేమం సాధించడానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం, నూతన ఐటి పాలసీని ప్రకటించడం, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో, 13 జిల్లాల సమగ్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ రూపొందించడం, ఆరోగ్యశ్రీ స్థానంలో అంతకన్నా మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఎన్టీఆర్ ఆరోగ్యసేవ అనే నూతన పథకం ఏర్పాటుకు కృషి చేయడం వంటివన్నీ స్వాగతించాల్సిన విషయాలే. అయినా, వాస్తవానికి పదేళ్ళ కాంగ్రెస్ పాలనలో వున్న అస్తవ్యస్త పరిస్థితిని సరిచేసుకుంటూ, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి మార్గం పట్టించడమంటే అంత సులువేమీ కాదు. సమస్యల సుడిలో వున్న అనేక రంగాలను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని ప్రజల ఆకాంక్షల మేరకు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమంటే మాటలతో పని కాదు. అందులోనూ అన్నిటికీ మించి మరో క్లిష్టమైన పని రాజధాని నిర్మాణం.. తెలంగాణకు వడ్డించిన విస్తరివంటి హైదరాబాద్ రాజధానిగా వుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఆ పరిస్థితి లేదు. రాజధాని లేకుండానే పరిపాలన సాగించాల్సివస్తోంది. రాజధాని నిర్మాణానికి లక్షలాది కోట్ల రూపాయలు అవసరమవుతాయి. రాజధాని నిర్మించుకోవడం, పరిపాలనకు అనువుగా కార్యాలయాలన్నీ అక్కడికి తరలించడం ఈ రెండు పనులూ చకచకా జరిగిపోవాలంటే అయ్యేపని కాదు. భూముల ధరలు ఆకాశానికంటిన ఈ తరుణంలో విజయవాడ వద్ద రాజధాని నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేయాలంటే అంత సులభమైన పనేమీ కాదు. భూములను ఇచ్చేందుకు రైతులను ఒప్పించి, రాజధాని నిర్మాణం చేయాలంటే చేయాల్సిన కసరత్తు మరెంతో వుంది. ఇది ఎప్పటికి జరుగుతుందో, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. దేనికైనా ముందు నిధులు కావాలి. ఆ నిధులు ఎక్కడినుంచి తేవాలి?..అదే పెద్ద సమస్య. వీటన్నిటికీ తోడు రుణమాఫీ పథకం అమలు చేసి, ప్రజలకిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రికి మరో పెద్ద సమస్యగా మారింది. అసలే, భారీ ఆర్థిక లోటు నిత్యం రాష్ట్ర ప్రగతిని సవాల్ చేస్తుంటే, అన్ని సమస్యలనూ అధిగమించి అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ వేగం పుంజుకోవాలంటే, సొంతకాళ్ళమీద నిలబడి పరిపాలన సాగాలంటే ఎంతో కష్టసాధ్యంగా వుంటోంది. ఇప్పటికే అనేకానేక సమస్యల సుడిలో వున్న ఆంధ్రప్రదేశ్ ప్రగతి పరుగుకు అడుగులు తడబడుతూనే వున్నాయి. అయినాసరే, ఎలాగైనా నిలదొక్కుకొని, ప్రజల ఆశలను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని, మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రగతి పనులను వేగవంతం చేయాల్సివుంది.

ఇప్పటికే అన్ని విషయాల్లోనూ ముఖ్యమంత్రి ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కేంద్రంతో సంబంధాలను పటిష్టపరుచుకుంటూనే, రాష్ట్రానికి అవసరమైన అభివృద్ధి పనులను సాధించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. చేయగలిగిన అభివృద్ధి పనులన్నిటినీ చేస్తున్నారు. పొలం పిలుస్తోంది, నీరు-చెట్టు, ఎన్టీఆర్ సుజలస్రవంతి, దేవాలయాల్లో నిత్యాన్నదానం తదితర పథకాలను ఆచరణలోకి తేవడం, మరిన్ని పథకాలకు ప్రణాళికలు రూపొందిస్తుండడం ఎంతైనా అభినందనీయమే. ఏదేమైనప్పటికీ, రాష్ట్రం ప్రస్తుతం వున్న క్లిష్ట పరిస్థితుల్లో ఎన్నో సమస్యలను అధిగమిస్తూనే ఈ నూరురోజుల్లో పలు ఘనమైన పనులనే సాధించారని చెప్పవచ్చు. అయితే, ఇంకా చేయాల్సింది, సాధించాల్సింది మరెంతో వుంది. కార్యసాధనలో, ఆచరణాత్మకమైన పథకాల అమలులో మరింత వేగం పెంచాల్సివుంది. సమస్యల సవాళ్ళను దీటుగా ఎదుర్కొని, రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం అలుపెరుగని కృషి చేయాల్సివుంది. అప్పుడే.. నవ్యాంధ్రప్రదేశ్‌కు నవోదయం చేరువవుతుంది..అదే నిజమైన చంద్రోదయం అవుతుంది.

# ఈ ఫలితాలు దేనికి సంకేతం?




ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఉపఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. 3లోకసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే సిటింగ్ పార్టీలే ఆ స్థానాలు నిలబెట్టుకున్నాయి.

ప్రధాని నరేంద్రమోడీ రాజీనామాతో ఉపఎన్నిక జరిగిన వడోదర(గుజరాత్) స్థానాన్ని బీజేపీ, ములాయంసింగ్‌యాదవ్ రాజీనామాతో ఉపఎన్నిక జరిగిన మెయిన్‌పురా(యూపీ) స్థానాన్ని తిరిగి సమాజ్‌వాదీపార్టీ, తెలంగాణ సీఎం కేసీఆర్ రాజీనామాతో ఉపఎన్నిక జరిగిన మెదక్(తెలంగాణ) స్థానాన్ని తిరిగి టీఆర్ఎస్ నిలబెట్టుకున్నాయి.

ఇంతవరకు బాగానే వుంది. అసెంబ్లీ ఫలితాలే కొంత తేడాగా వచ్చాయి. బీజేపీకి కొంత ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో 80సీట్లకు గాను బీజేపీ 71సీట్లను గెలుచుకుంది. కాని ఉపఎన్నికలు జరిగిన 11అసెంబ్లీ స్థానాలలో బీజేపీకి 3స్థానాలే దక్కగా అధికార సమాజ్‌వాదీకి 8స్థానాలు దక్కాయి. అలాగే రాజస్థాన్‌లో 4స్థానాలకు ఎన్నికలు జరిగితే అధికార బీజేపీ ఒక స్థానమే గెలుచుకుంది. కాంగ్రెస్‌కు మూడు దక్కాయి. గుజరాత్‌లోనూ కాంగ్రెస్ పుంజుకుంది. బీజేపీ ఆరుస్థానాలు గెలుచుకోగా కాంగ్రెస్ మూడు స్థానాలలో గెలిచింది. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ చెరోస్థానంలో గెలిచాయి. ఇక ఏపిలో ఉపఎన్నిక జరిగిన నందిగామ అసెంబ్లీని అధికార తెలుగుదేశం నిలబెట్టుకుంది. వివిధ రాష్ట్రాలలో వెలువడిన ఈ ఫలితాలను చాలా మంది నరేంద్ర మోడీ పాలనకు రెఫరెండం అని చెబుతున్నారు. ఇదెంతమాత్రం వాస్తవం కాదు. వంద రోజుల్లో ఏ నాయకుడు కూడా అద్భుతాలు చేయలేరు. ఇంతపెద్ద దేశంలో వందరోజుల్లోనే అనూహ్య మార్పులు తేవాలంటే మంత్రదండాలు ప్రయోగించాల్సిందే! వందరోజుల్లోనే ఏమీ చేయలేక పోయారని ప్రజలు తీర్పిచ్చినా అది ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదు. ఈ వందరోజుల్లో ప్రజలు వ్యతిరేకించే నిర్ణయాలేవీ మోడీ తీసుకోలేదు. దేశంలోని అన్ని వ్యవస్థలను గాడిన పెట్టేందుకు ఆయన ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తూనే వుంది. చంద్రబాబు లాగా అలివిగాని వాగ్దానాలు చేసి ఆయన వాటితో కుస్తీ పట్టడం లేదు. యూపిలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం బలహీనంగా వుంది. అలాగే రాజస్థాన్‌లో వసుంధర రాజే పాలన పట్టు తప్పుతోంది. గుజరాత్‌లో మోడీ లేని లోటు కనిపిస్తుంది. కాబట్టే బీజేపీకి చేదు ఫలితాలు వచ్చాయి. ప్రతి ఎన్నికలలోనూ మోడీ ప్రభంజనం పనిచేస్తుందనుకోవడం పెద్ద పొరపాటు!

అయితే ఈ ఫలితాలను బీజేపీ ఒక హెచ్చరికగా మాత్రం తీసుకోవాల్సి వుంది. మోడీ మంత్రం ఎల్లకాలం పనిచేయలేదనడానికి ఈ ఫలితాలు నిదర్శనం. జాతీయ స్థాయిలోనే కాదు, రాష్ట్రస్థాయిలో కూడా నాయకత్వం పటిష్టంగా ఉంటేనే అందుకు అనువుగా ఫలితాలుంటాయి. యూపీలో లోక్‌సభ ఎన్నికల గెలుపును బీజేపీ వాపుగా తీసుకుంది. ఆ రాష్ట్రంలో సమాజ్‌వాదీ ప్రభుత్వం పలు విధాలుగా వైఫల్యం చెందింది. అయినా ఉపఎన్నికల ఫలితాలు ఆ పార్టీకే అనుకూలంగా వచ్చాయంటే స్థానిక నాయకత్వం బలంగా ఉండడమే. రాజస్థాన్, గుజరాత్ ఫలితాలు కూడా బీజేపీకి ప్రమాదసంకేతాలు. ఆ రాష్ట్రాలలోనూ జాగ్రత్త పడకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు.




## దగాస్వామ్యం

రాష్ట్రంలో కానీ, కేంద్రంలో కానీ స్పీకర్ల పాత్ర కీలకమైంది. నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా వ్యవహరించి సభను సజావుగా నడిపించడం స్పీకర్ బాధ్యత. నిర్మాణాత్మకమైన, ప్రజోపకరమైన విమర్శలు చేస్తూ హుందాతనంగా వ్యవహరించి, సభ సాఫీగా జరిగేట్టు సహకరించడం ప్రతిపక్షనేత బాధ్యత. అధికారపక్షం అహంకారపక్షంగా వ్యవహరించినప్పుడు స్పీకర్ దానికి చెక్ పెట్టాలి. అభిశంసనకు గురి అవుతామని భయపడకూడదు. అలాకాకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తే అసెంబ్లీ పక్షవాతరోగిగా మారుతుంది. ప్రతిపక్షనేత ప్రజోపయోగకరమైన ప్రశ్నలు సంధిస్తూ అధికారపక్షాన్ని నిలదీయాలి. అలాకాకుండా కొంతమంది ప్రతిపక్షనేతలు అధికారపక్షంతో కుమ్మక్కయి అధికారపక్షం అధికారానికి దూరమైనపుడు దాన్ని విమర్శిస్తూ ఉండే ప్రతిపక్షనేత కూడా పక్షవాతరోగే! స్పీకర్లు, ప్రతిపక్షనేతలు సక్రమంగా వ్యవహరిస్తేనే అది ప్రజాస్వామ్యం. లేకుంటే... అది ముమ్మాటికీ దగాస్వామ్యం.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## ఇంత బిల్డప్ అవసరమా?

ఏపి రాజధానిని సింగపూర్ చేయాల్నా, చికాగోలాగా చేయాల్నా అంటూ రాష్ట్ర మంత్రులను విదేశాలకు పంపించడం విచిత్రంగా వుంది. ఇప్పుడు ప్రజలకు సింగపూర్, చికాగోలాంటి రాజధానులు అవసరం లేదు. వాళ్ల అవసరాలు తీర్చే విధంగా పరిపాలన ఉంటే చాలు. గతంలో సింగపూర్, మలేషియాల పేర్లు చెప్పి చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టారు. మళ్లీ అదే పోకడలకు పోతున్నారు. మనకు కావాల్సిన రాజధాని మనకు తగినట్లు ఉంటేనే చాలు.

**జి.యస్.రెడ్డి, నెల్లూరు.**

## నెల్లూరేం పాపం చేసింది

నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చకపోవడం విచారకరం. మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే ఏ ప్రాంతం వారైనా వచ్చి బ్రతక గలిగేది నెల్లూరులోనే! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా నెల్లూరును చిన్నచూపు చూస్తున్నాయి. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా నెల్లూరును స్మార్ట్‌సిటీగా చేయడానికి ప్రయత్నం చేయకపోవడం విచారకరం.

**మంగుపల్లి సతీష్, నెల్లూరు.**

## సైకో నరమేధం

భగవంతుడు ఉన్నాడో లేదోగాని ఆయన పేరుతో మాత్రం కొందరు నరమేధం సృష్టిస్తున్నారు. మనుషులను చంపడంలో సైకోలను మించిపోతున్నారు. తల్లిదండ్రుల ఆదరణ లేక సరైన చదువులు లేక మూర్ఖపు గురువుల మత ఛాందస బోధనలతో రాక్షసులుగా మారుతున్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఐఎస్ఐ తీవ్రవాదుల చర్యలు ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇస్లాం ఎంతో ఉన్నతమైన మతం. కాని ఆ మతం పేరుతో ఉగ్రవాద కార్యకలాపాలు నడపడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## • ఇద్దరు నాయకులు పగబట్టారా...?



# నిన్న పోర్ట్ పోయే... నేడు స్మార్ట్ పాయే...

**ఈ జిల్లాలో సీట్లు వచ్చాయి, ఆ జిల్లాలో ఓట్లు రాలేదు. కాబట్టి అభివృద్ధి పనులన్నీ సీట్లు, ఓట్లు వచ్చిన జిల్లాలకే ఇవ్వాలి. మన పార్టీకి ఓట్లు వేయని జిల్లాలలో అసలు ఏ అభివృద్ధి పని కూడా చేపట్టకూడదు అనే దుర్మార్గపు, ఛండాలపు సంస్కృతిని ఇన్నేళ్ల చరిత్రలో ఇప్పుడే చూస్తున్నాం. పాలకులు, ప్రభుత్వాలు ప్రాంతాలను బట్టి పక్షపాతంగా వ్యవహరిస్తుండడం ఇప్పుడే గమనిస్తున్నాం.**

మొన్నటి ఎన్నికల ఫలితాలు జిల్లా అభివృద్ధికి పెనుశాపంగా మారుతున్నాయి. మొన్న నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఎక్కువ సీట్లొచ్చాయి. కాని రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చింది. ఇక్కడ నుండే నెల్లూరుజిల్లాపై చిన్నచూపు మొదలైంది. తన పార్టీకి ఎక్కువ సీట్లు ఇవ్వని నెల్లూరుజిల్లా ప్రజలపై చంద్రబాబు కక్ష పెంచుకున్నాడు. ఈ జిల్లాకు ఏ ఒక్క ప్రాజెక్ట్‌నూ ఇవ్వలేదు. కేంద్రప్రభుత్వం 11జాతీయసంస్థలను మంజూరుచేస్తే వాటిలో ఒక్క దానిని కూడా నెల్లూరుకు ఇవ్వలేదు సరికదా గత యూపిఏ ప్రభుత్వం గెజిట్ నోట్ విడుదల చేసిన దుగరాజపట్నం పోర్టును కూడా లేపేసారు. ఈమధ్య చంద్రబాబు జిల్లాల వారీగా ప్రకటించిన వరాలలో నెల్లూరుజిల్లాకు చెప్పినవన్నీ కూడా పాతవే! జిల్లాలో అధికారపార్టీ నుండి ముఖ్యనేతలు ఓడిపోయి ఉండడం, చంద్రబాబు జిల్లాపై పగతో రగిలిపోతున్న నేపథ్యంలో ఇక జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడే దిక్కనుకున్నారు. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం అభివృద్ధి చేయదలచిన 100స్మార్ట్ సిటీ నగరాలలో ఖచ్చితంగా నెల్లూరు ఉంటుందని భావిస్తూ వచ్చారు. వెంకయ్యనాయుడు ప్రోద్భలంతోనే నెల్లూరుకు చోటు దక్కుతుందనుకున్నారు. తీరా చూస్తే కేంద్రం విడుదల చేసిన వంద స్మార్ట్‌సిటీల జాబితాలో నెల్లూరు లేకపోవడం చూసి ఇక్కడి ప్రజలు నివ్వెరపోయారు. చంద్రబాబునాయుడు మాదిరిగానే వెంకయ్యనాయుడు కూడా ఈ జిల్లా మీద పగబట్టారా? అని అనుకుంటున్నారు. ఎందుకంటే ఇక్కడి ఎన్నికల ఫలితాలు వెంకయ్యను కూడా తీవ్ర నిరాశకు గురిచేశాయి. నెల్లూరు, తిరుపతి లోక్‌సభలలో ఒక్కటి కూడా బీజేపీ, తెలుగుదేశం గెలవలేదు. ఇక ఏ ముఖం పెట్టుకుని కేంద్రంను నిధులడగాలని వెంకయ్య గతంలోనే ప్రశ్నించి ఉన్నారు. కేంద్రంను ఆయన అలా గట్టిగా అడగలేకపోబట్టే స్మార్టు సిటీల జాబితాలో నెల్లూరు మిస్సయ్యిందనేది చాలామంది అభిప్రాయం.

## • అందరూ రాజీపడ్డారు

# కుదిరిన సర్దుబాటు అజీజ్‌కు తప్పిన తలపోటు



**నెల్లూరు నగరపాలక సంస్థలో అధికారపార్టీ సభ్యుల మధ్య కొనసాగుతున్న అంతర్గత పోరుకు తెరపడింది. వీళ్లల్లో వీళ్లు కుమ్ములాడుకోవడం మాని ఇక ప్రతిపక్షంతో కుమ్ములాటకు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నారు. తమ మధ్య విభేదాలకు స్వస్తి చెప్పాలనుకున్నారు. కలిసికట్టుగా పనిచేయాలని, అందరినీ కలుపుకుపోవాలని నిర్ణయించారు.**



నెల్లూరు కార్పొరేషన్‌కు సంబంధించి తెలుగుదేశంపార్టీలోనే రెండు గ్రూపులున్నాయి. మేయర్ అజీజ్, అతని వెంట వచ్చిన 12మంది కార్పొరేటర్లను ముందు నుండి తెలుగుదేశంలో వున్న కార్పొరేటర్లు అంటరాని వారి మాదిరిగా చూడసాగారు. తమకేమాత్రం సమాచారం లేకుండా అజీజ్‌ను ఆయన వెంట వచ్చిన కార్పొరేటర్లను తెలుగుదేశంలో చేర్చుకోవడాన్ని వీళ్ళు జీర్ణించుకోలేకపోయారు. అజీజ్‌ను పార్టీలో చేర్చుకుని తమకు అండగా నిలిచిన మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్‌కు అన్యాయం చేసారనే అభిప్రాయం వీరిలో వుంది. అందుకే అజీజ్ పార్టీలో చేరినా తెలుగుదేశం కార్పొరేటర్లు ఆయన వెంట పోలేదు. ఇంతకాలం మేయర్‌తో సంబంధం లేకుండా తమ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. డాక్టర్ జడ్.ఎస్ నాయకత్వంలో పనిచేయసాగారు. దీంతో అటు వైకాపాను వదిలేసి, ఇటు తెలుగుదేశం కార్పొరేటర్లు కలిసిరాక మేయర్ అజీజ్ పరిస్థితి గాల్లో ఉన్నట్లయ్యింది. ఇటీవల పార్టీ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం పెట్టినా పెద్దగా ఫలితం లేకుండాపోయింది. కార్పొరేషన్‌లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కనీసం ఇంతవరకు కౌన్సిల్ సమావేశాన్ని కూడా నిర్వహించలేకపోయారు. ఇలా అయితే కుదరదనుకున్న అజీజ్, తెలుగుదేశం కార్పొరేటర్లతో మొన్న ఒకరోజు పంచాయితీ పెట్టుకున్నారు. అందరం కలసి పనిచేద్దామని, మీ అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంలోనే తెలుగుదేశం కార్పొరేటర్లు అందుకు సంసిద్ధం వ్యక్తం చేస్తూ కొన్ని నిబంధనలు పెట్టారు. ఆయా డివిజన్‌లలో కార్పొరేటర్లుగా పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులకు ప్రాధాన్యతనివ్వాలి, పి.ఏలు, అనుచరులు కాకుండా మేయరే నేరుగా కార్పొరేటర్లకు ఫోన్‌లు చేసి కార్యక్రమాలకు ఆహ్వానించాలి. మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్‌కు తగిన ప్రాధాన్యత కల్పించాలి, ప్రతి విషయంలోనూ ఆయన సలహాలు, సూచనలు తీసుకోవాలి, షాడోల వంటి పోకడలను ఒప్పుకోము, ప్రోటోకాల్‌ను విధిగా పాటించాలి అనే ప్రతిపాదనలు పెట్టగా అజీజ్ అందుకు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో ఇప్పటి వరకు ఎడమొఖం, పెడమొఖంగా ఉన్న మేయర్‌కు, దేశం కార్పొరేటర్లకు రాజీ కుదిరినట్లయ్యింది. దీంతో ఇకనన్నా నగరపాలన మొదలవుతుందేమో చూడాలి.

# హీరో బండి... ఆంధ్రాకేనండి!

**నెల్లూరు - చిత్తూరు జిల్లాల మధ్య పరిశ్రమ**

ప్రపంచంలోనే పేరెన్నికగన్న ద్విచక్ర మోటారు వాహనాల కంపెనీ హీరో మోటోకార్ప్ తమ పరిశ్రమను నెల్లూరు జిల్లా సమీపంలో చిత్తూరుజిల్లా పరిధిలో నెలకొల్పడానికి ముందుకొచ్చింది. తడ వద్దగల శ్రీసిటీ సెజ్‌కు సమీపంలో 600ఎకరాల భూమిని హీరో కంపెనీకి రాష్ట్రప్రభుత్వం కేటాయించడానికి అంగీకరించింది. ఈ భూమిని ఏపి ఐఐసి ద్వారా ఇస్తారు. హీరో కంపెనీ తమ ప్లాంటును దక్షిణభారతదేశంలో పెట్టడానికి సిద్ధమవగానే ఆంధ్రాతోపాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు ఆ కంపెనీకి రెడ్‌కార్పెట్ పరిచాయి. పోటీలుపడి రాయితీలు కూడా ప్రకటించాయి. అయితే హీరో కంపెనీ యాజమాన్యం భౌగోళిక పరిస్థితులు, రాయితీలు, రవాణా సౌకర్యాలను బేరీజు వేసుకుని నెల్లూరుజిల్లా కృష్ణపట్నంపోర్టు సెజ్‌లో తమ ప్లాంటును ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే నెల్లూరుజిల్లాలో ఏ పరిశ్రమ రాకూడదని పంతం పట్టివున్న ప్రభుత్వం దీనికి మొగ్గు చూపలేదు. దీంతో హీరో కంపెనీవాళ్లు తెలంగాణ, కర్నాటకాలో తమ ప్లాంటు ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించసాగారు. రాష్ట్రానికి వస్తుందనుకున్న ప్లాంటు రాకుండాపోయే ప్రమాదం ఏర్పడడంతో చంద్రబాబు ఢిల్లీలో హీరో కంపెనీ యాజమాన్యాన్ని కలిసారు. పలు రాయితీలు ప్రకటించారు. దీంతో హీరో కంపెనీ ఆంధ్రాకు రావడానికి మొగ్గుచూపింది. శ్రీసిటీలో ఇప్పటికే 'ఇసుజు' మోటార్ కంపెనీ నిర్మాణంలో వుంది. 'హీరో' ప్లాంటు కూడా దానికి సమీపంలోనే వుంది. దగ్గరలో జాతీయ రహదారి వుండడం, చెన్నై ఎయిర్‌పోర్టు, సీపోర్టు అందుబాటులో వుండడం కూడా ఈ ప్లాంటు నిర్మాణానికి కలిసొచ్చే అంశాలు.

మొత్తం 2200కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంటును రెండున్నరేళ్లలో పూర్తి చేయనున్నారు. ఏడాదికి 18లక్షల వాహనాలను ఇక్కడ నుండి ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్లాంటులో 5వేల మందికి ప్రత్యక్షంగా మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ హీరో ప్లాంటు రాకతో చిత్తూరుజిల్లా కంటే శ్రీ సిటీ సమీపంలోని తడ, సూళ్లూరుపేట వంటి పట్టణాలు అభివృద్ధిచెందే అవకాశాలున్నాయి.

# నాకొక జాబు కావాలి

## బదిలీలకు సిఫార్సులకు లింకు

**ప్రభుత్వ అధికారులకు పోస్టింగ్ ఆయా శాఖల ఉన్నతాధికారులు, ప్రభుత్వ పరిధిలో జరగాల్సిన అంశం. పరిపాలనా సౌలభ్యాన్ని బట్టి బదిలీలుండాలి. అధికారులు శక్తిసామర్ధ్యాలను బట్టి పోస్టింగ్‌లు ఇవ్వాలి. దురదృష్టం ఏమిటంటే బదిలీలలో కూడా రాజకీయ జోక్యం పెరిగిపోయింది. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల సిఫార్సు లేఖలతో అధికారులకు పోస్టింగ్‌లు కేటాయించే ఒక విషసంస్కృతి ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా విజృంభించి వుంది.**

ఈ పాడు సంస్కృతికి గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పునాది పడింది. ఏ అధికారి పోస్టింగ్ కావాలన్నా ఎమ్మెల్యేదో, మంత్రిదో లేఖ తీసుకోమనే వాళ్లు. అయితే అప్పుడు ఈ కార్యక్రమం అనధికారికంగా జరిగిపోయింది. చంద్రబాబు వచ్చాక ఈ లెటర్‌ల సంస్కృతికి తెర దించుతాడనుకున్నారు. కాని అలా జరగలేదు. లెటర్‌ల సంస్కృతిని బహిర్గతం చేశాడు. ఇదో చట్టబద్ధ కార్యక్రమం అన్నట్లు అమలు చేస్తున్నారు. ఓ అధికారి జిల్లాలోని ఓ నియోజకవర్గంలోకి బదిలీ కావాలనుకున్నాడనుకుందాం, సదరు నియోజకవర్గంలో అధికారపార్టీ ఎమ్మెల్యే లేకుంటే ఓడిపోయిన అభ్యర్థి సిఫార్సు లేఖ తీసుకోవాలి. ఇక ఆయన కాకుండా జిల్లాలో అధికారపార్టీకి సంబంధించి ముఖ్య నాయకుల లెటర్లన్నీ సంపాదించాలి. ఇవన్నీ ఉంటేనే ఆయన బదిలీ జరుగుతుందన్నమాట. అంతేకాకుండా నాయకులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ అధికారులను తిప్పుకుంటున్నారు. అధికారపార్టీ నాయకుల చుట్టూ తిరగలేక కొంతమంది ఆఫీసర్లయితే ఎక్కడికి పోస్టింగ్ ఇస్తే అక్కడకు పోవడానికి సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఈ బదిలీలలో ఒక సామాజికవర్గం వారినే టార్గెట్‌గా చేసుకుంటున్నారు. పోస్టింగ్‌లలో ఆ సామాజికవర్గం వాళ్లను లూప్‌లైన్‌లలోకి తరమడమే కర్తవ్యంగా పెట్టుకున్నారు.



# బరిలో కొడుకులు



విక్రమసింహపురి రాజ్యాన్ని మనుమసిద్ధి మహారాజు ఎన్నేళ్లు ఏలాడో తెలియదుగాని ఆనం వివేకానందరెడ్డి మాత్రం నెల్లూరు నగరాన్ని 20ఏళ్ల పాటు పరిపాలించాడు. నెల్లూరు రాజకీయచరిత్రలో ఇదో రికార్డు. ఒకసారి మున్సిపల్ ఛైర్మెన్‌గా ఆ తర్వాత మూడుదఫాలు ఎమ్మెల్యేగా నెల్లూరులో రాజ్యాన్ని ఏలిన ఘనత ఆయనదే! ఈ 20ఏళ్లు నెల్లూరు రాజకీయాలలో ఎంతో సందడి కనిపించింది. మంచిగానైనా, చెడుగానైనా వివేకా కనిపించని రోజంటూ ఉండేది కాదు. తిట్టినా, తిట్టించుకున్నా వివేకా స్టైలే వేరుగా ఉండేది. వివేకా కాలమంతా కూడా ఎంతో సందడిగా సాగింది.

కాని ఎంత మేకప్ చేసుకుంటున్నా పెరిగే వయసును ఆపలేం కదా! వివేకాకు అదే సమస్య అయ్యింది. ఈమధ్య దాకా 'రేసుగుర్రం'లా తిరిగిన మనిషి ఇప్పుడు అలసిపోయాడు. తిరిగే ఓపిక తగ్గింది. దీంతో ఆయన రాజకీయ వారసులుగా ఇద్దరు కొడుకులు రంగప్రవేశం చేశారు. 2014లోనే ఇద్దరు కొడుకుల రాజకీయ ఆరంగేట్రం జరిగిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో చిన్నకొడుకు ఆనం రంగమయూర్‌రెడ్డి 12వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిస్తే, పెద్దకొడుకు ఆనం చెంచుసుబ్బారెడ్డి మాత్రం నెల్లూరు నగర అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయాడు. ఈమధ్యకాలంలో ఇద్దరు కూడా బాగానే పబ్లిక్‌లోకి వస్తున్నారు. సమస్యలపై గళం విప్పుతున్నారు. వివేకా శైలిలోనే మీడియాను తమ ప్రచారాస్త్రాలుగా వాడుకుంటున్నారు. వివేకా తన కొడుకులిద్దరిని పొలిటికల్ మిసైల్స్ మాదిరిగా తయారు చేసే క్రమంలో తెరవెనుక దర్శకత్వం వహిస్తున్నారు.

## షాజహాన్‌కు అవార్డు

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మేనేజర్ షేక్ షాజహాన్‌కు హిందీ దివస్ పురస్కారం లభించింది. విజయవాడ డివిజన్ పరిధి లోని నెల్లూరు రైల్వేస్టేషన్ మేనేజర్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం సికింద్రాబాదులో జరిగిన అవార్డుల ప్రదా నోత్సవ కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాస్తవ చేతులమీదుగా షాజహాన్ ఈ అవార్డు అందుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## మొదటి సమావేశానికి సమాయత్తం

నెల్లూరు నగర పాలకవర్గం సమావేశం ఈనెల 29వతేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నగర పాలక సంస్థ కమీషనర్ జాన్ శ్యాంసన్ సెలవుల్లో ఉండడంతో అధికారకంగా ఇంకా ప్రకటించలేదు. నూతన పాలకవర్గంలోని కౌన్సిల్ సమావేశం కావడంతో అజెండా తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు.

## సినారాకు సినారె అభినందన



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావు హైదరాబాద్‌లోని కిరణ్ సాంస్కృతిక సమాఖ్యవారి కవితా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో చిన్ని నారాయణరావు ఆ పురస్కారాన్ని ప్రముఖ కవి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. చిన్ని నారాయణరావు రచించిన 'పతాక శీర్షిక' అనే కవితను ఈ సందర్భంగా సినారె ఆసాంతం విని అభినందించారు.

## ఏం ఒరగబెట్టారని సంబరాలు?

**- అరుణమ్మ విమర్శ**



వందరోజుల పాలనలో తెలుగుదేశం ప్రభుత్వం ఏం ఒరగబెట్టారని, ఏం సాధిం చారని సంబరాలు చేసుకుంటున్నారని నెల్లూరుజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు పందిళ్ళపల్లి అరుణమ్మ ఎద్దేవా చేశారు. వందరోజుల పాలనలో చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా చెప్పిన అబద్దాలు మళ్ళీ చెప్పకుండా వంద అబద్దాలు చెప్పి ప్రజల్ని వంచించినందుకా ఈ సంబరాలంటూ విమర్శించారు.




ఈనాడు 'శని'

"ఆది" అంటారేంటి, అంతా! మతిమరుపా? తెల్లారి'కల'లో 'ఆదివారమే'. అని, నా 'ట్యూబ్ లైట్' మతికి 'జ్ఞప్తి' కొచ్చింది. Sonాడే, చెత్త, చిత్తభ్రమ. 'ఎల్లుండి' ప్రపంచ 'మతి మరుపు' రోజు.

డా॥ పెళ్లకూరు జె.పి.రెడ్డి

M.B.B.S., FSI., FIC, (USA), చర్మ & తొలి సెక్సాలజిస్ట్, నెల్లూరు. మంగు, బొల్లికై: 0861 - 2333666


## స్మార్ట్‌సిటీ విషయంలో ఆందోళన వద్దు

స్మార్ట్‌సిటీ విషయంలో ఆందోళన పడవద్దని, నెల్లూరును స్మార్ట్ సిటీగా చేస్తానని వెంకయ్యనాయుడు హామీ ఇచ్చిన మేరకు జిల్లా అభివృద్ధి విషయంలో రాజీపడరని భారతీయజనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, నెల్లూరుజిల్లా పార్టీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. వెంకయ్యనాయుడు జిల్లా అభివృద్ధికి వెయ్యికోట్లు కేటాయించారన్నారు. స్మార్ట్ సిటీ కంటే ఎక్కువ నిధులను నెల్లూరుకు కేటాయిస్తారని, ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## హోంగార్డు కుటుంబానికి సాయం

నెల్లూరు జిల్లా గూడూరు హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు జి.శ్రీనివాసులు కుటుంబానికి జిల్లాలో పనిచేస్తున్న హోం గార్డులు ఒకరోజు వేతనాన్ని కేటాయించగా సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రూ.1,78,950లు చెక్కును మృతుని భార్య జి.సుప్రజకు ఎస్పీ సెంథిల్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ రెడ్డి గంగాధరరావు, హోంగార్డు డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ చిరంజీవి, హోంగార్డులు పాల్గొన్నారు.

## సుందరనగరంగా నెల్లూరు అభివృద్ధి

**నగర మేయర్ అబ్దుల్ అజీజ్**

నెల్లూరు నగరాన్ని సుందరనగరంగా అభివృద్ధి చేయనున్నట్లు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరణ బండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నాలుగు డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రతి డివిజన్‌కు చెత్తసేకరణకు 8బండ్లు, 16మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతమయితే 54 డివిజన్లలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్లు శ్రీనివాస్, వెంకట్రావ్, డిఈఈ చంద్రయ్య, శానిటరీ సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు, కార్పొరేటర్లు బాలకోటేశ్వరరావు, మన్నెం పెంచలయ్య, దేవరాల మస్తానమ్మ, పిట్టి సత్యనాగేశ్వరరావు, ప్రశాంత్‌కిరణ్, బొల్లినేని శ్రీవిద్య, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## నగరాన్ని వదిలేసి రాష్ట్రాలు తిరుగుతున్నాడు

నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ నగరాన్ని వదిలేసి రాష్ట్రాలు తిరుగుతున్నాడని దీంతో నగరంలోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆరోపించారు. 13వతేదీ నగరపాలక సంస్థ కార్యా లయంలో విలేకర్లతో మాట్లాడారు. పాలకవర్గం ఏర్పడి రెండున్నర నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రూప్‌కుమార్‌యాదవ్, ఖలీల్, రాజశేఖర్, ప్రశాంత్‌కిరణ్, నాగరాజు, ఊటుకూరు మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి

**బిజెపి శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు**

అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కోరామని భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్షనేత విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. ఈ నెల13న నెల్లూరు నగరానికి వచ్చిన రాజు విలేఖర్లతో మాటాడ్డారు. రాష్ట్రాన్ని ఆదు కోవాలని అన్ని పార్టీలు ఆర్థిక సంఘాన్ని కోరాయన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, జిల్లా నగర అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, కావలి మునిసిపల్ ఉపాధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి మారుతీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ శాస్త్రాల బ్రోచర్ విడుదల

ఏబివిపి ఆధ్వర్యంలో విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో మంగళవారం భారతీయశాస్త్రాలు, పునరుద్దీకరణ అనే అంశం పై దక్షిణ భారత స్థాయిలో జరిగే రెండు రోజుల వర్క్‌షాపు బ్రోచర్‌ను విక్రమ సింహపురి ఉపకులపతి ప్రొఫెసర్ రాజారామిరెడ్డి విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్రాలు ఎంతో అవసరమన్నారు. ఎబివిపి నాయకులు ఆర్.మస్తాన్‌రెడ్డి, జగన్‌లు పాల్గొన్నారు.

## దారుణ హత్య


నెల్లూరు నగరం సుందరయ్య కాలనీ వద్ద ఆదివారం అర్ధరాత్రి పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు ఇస్మాయిల్(28) పలు కేసుల్లో నిందితుడు. చెడువ్యసనాలకు బానిసైన ఇస్మాయిల్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 10 మంది వ్యక్తులు బైకుల పై వచ్చి ఇస్మాయిల్‌ని, అతని స్నేహితుడు కృష్ణారెడ్డిలను కర్రలతో కొట్టారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇస్మాయిల్ మృతిచెందాడు. ఐదవ నగర ఇన్‌స్పెక్టర్ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పీపుల్స్ పార్క్‌ను అభివృద్ధి చేయాలి

నెల్లూరు నగరం హరనాథపురంలోని పీపుల్స్ పార్కును అభివృద్ధి చేయాలని పార్కు అసోసియేషన్ నాయకులు ఆదివారం నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, అనిల్‌కుమార్, దారా వంశీకృష్ణ పాల్గొన్నారు.

## 25 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, నగరంలోని యర్రకట్ట, టెక్కెమిట్టలో వున్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 25న ఉత్సవాలకు కలశస్థాపన చేస్తామని, ఈ సంధ్బంగా అమ్మవారికి చండీ అలంకారం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా 26న భవానీదేవి అలంకారం, 27న శ్రీ గాయత్రీదేవి, 28న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం, 29న గజలక్ష్మి అలంకారం, 30న శ్రీ కాళికాదేవి అలంకారం, వచ్చే నెల 1వ తేదిన సరస్వతీదేవి అలంకారం 2న దుర్గాదేవి అలంకారం, అదే రోజున మహర్నవమి సందర్భంగా మహిషాసురమర్దిని అలంకారం నిర్వహిస్తా మన్నారు. 3న విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారం, రాత్రికి శ్రీ లక్ష్మీనారాయణస్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 4న శ్రీ మహాలక్ష్మీదేవికి నగరోత్సవం, అనంతరం 10వతేదిన శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా, శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారికి పదహారు రోజుల పండుగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ రాత్రి 7.30 నుంచి 9గంటల వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షానికి పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్: 2322016, 2345676.

40వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ సమాహ్వానము

తేది 25-09-2014 నుండి తేది 03-10-2014 వరకు

ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించబడు శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ విశేష పూజలలో అశేష భక్తజనావళి పాల్గొని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ అమ్మవారి కరుణ కటాక్షములకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

ఉత్సవ కార్యక్రమములు

| తేది/వారము | కార్యక్రమము | ఉభయకర్తలు |
|---|---|---|
| తేది.25-09-14 గురువారము | శ్రీ చండీ అలంకారము | శ్రీ కొలిమెర్ల వెంకటేశ్వర్లు - శ్రీమతి వెంకట నాగలక్ష్మి గార్లు |
| తేది.26-09-14 శుక్రవారము | శ్రీ భవాని అలంకారము | శ్రీ మాగుంట సోదరులు, నెల్లూరు. |
| తేది.27-09-14 శనివారము | శ్రీ గాయత్రి అలంకారము | శ్రీ అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి గారు, కోవూరు. |
| తేది.28-09-14 ఆదివారము | శ్రీ అన్నపూర్ణ అలంకారము | శ్రీమతి దేవిరెడ్డి శైలజమ్మ గారు, చెన్నై |
| తేది.29-09-14 సోమవారము | శ్రీ గజలక్ష్మి అలంకారము | శ్రీ పొట్టిపాటి ద్వారకానాథ్‌రెడ్డి గారు, ఛైర్మన్, నిప్పో, నెల్లూరు. |
| తేది.30-09-14 మంగళవారము | శ్రీ కాళిక అలంకారము | శ్రీ చెన్నారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి రంజిత గార్లు, నెల్లూరు. |
| తేది.01-10-14 బుధవారము | శ్రీ సరస్వతి అలంకారము | శ్రీ బండారు మధుసూదన్‌రెడ్డి - శ్రీమతి బండారు రజనీ గార్లు, అమెరికా |
| తేది.02-10-14 గురువారము ఉ॥ | శ్రీ దుర్గా అలంకారము | శ్రీ రావులపల్లి వెంకట్రామానాయుడు - శ్రీమతి సులోచనమ్మ గార్లు, నెల్లూరు |
| తేది.02-10-14 గురువారము సా॥ | శ్రీ మహిషాసుర మర్దిని | శ్రీ అనం గోపాలకృష్ణారెడ్డి గారు, హైదరాబాదు |
| తేది.03-10-14 శుక్రవారము | శ్రీ రాజరాజేశ్వరి అలంకారం | శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ గార్లు, నెల్లూరు. |

02, 03వ తేదీలలో దేవాలయం లోపల ప్రదక్షిణములు నిలిపివేయబడును.

నగరోత్సవం: విజయదశమి నాడు రాత్రి గం.10-30ని.లకు మిరుమిట్లు గొలిపే బాణాసంచాలతో ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణతో, మహిషాసురమర్దని విచిత్ర వేషధారణతో, తప్పెట్లు, కోలాటములతో, పండరి భజనలతో, తెనాలి బ్యాండ్ కచ్చేరితో మంగళకర వాయిద్యములతో, వేద మంత్రోచ్ఛారణములతో శ్రీ అమ్మవారి నగరోత్సవము అత్యంత వైభవముగా జరుపబడును. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు.

అన్నదానం: తేది 04-10-2014 శనివారం మధ్యాహ్నం 12.00గం.లకు శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్-లత, ఆల్తూరు మహేష్-రాధిక వారి సౌజన్యముతో...

సదా అమ్మవారి సేవలో... భవదీయులు

రత్నం జయరామ్
వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు ఛైర్మన్ & ధర్మకర్తల మండలి

పాయసం నాగేశ్వరరావు M.A.,
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి

# అంతర్జాతీయ ప్రమాణాలతో నెల్లూరు 'అపోలో'


సమావేశంలో పాల్గొన్న డా॥ మదన్‌మోహన్‌రెడ్డి, డా॥ జయచంద్ర మరియు అపోలో వైద్యబృందం

అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య సేవలందించడంలో అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అగ్రగామిగా ఉన్నాయి. 1983లో చెన్నైలో డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి నేతృత్వంలో మొదలైన అపోలో ప్రస్థానం అంచెలంచెలుగా ఎదుగుతోంది. విదేశాలతో పాటు మన దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలకు కూడా అపోలో తన సేవలను విస్తరిస్తోంది. దేశంలోని 70కేంద్రాల్లో విస్తృతంగా వైద్య సేవలందిస్తోంది. అపోలో తన సేవలను నెల్లూరీయులకు అందించేందుకు అత్యాధునిక సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకువచ్చింది. నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు, పినాకినీనగర్‌లో అపోలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వివిధ చికిత్సల కోసం నెల్లూరీయులు చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలకు పోకుండా నెల్లూరు అపోలో ఆసుపత్రిలోనే అత్యాధునిక వసతులు కలిగిన వైద్య సేవలు తీసుకువస్తున్నారు. 200పడకలు, 60ఐసియూ పడకలతో, నైపుణ్యం కలిగిన వైద్యులతో విస్తృతంగా సేవలను అందించనుంది. అతితక్కువ ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన వైద్యసేవలు, 24 గంటలూ ఎమర్జెన్సీ సేవలు అందించడం అపోలో ప్రత్యేకత.

నెల్లూరుజిల్లా కలువాయికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో దేశంలో పేరొందిన వైద్యుల్లో ఒకరు. గత 20సంవత్సరాలుగా ఆర్థోపెడిక్ సర్జన్‌గా చెన్నై అపోలో ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నారు. మోకాళ్ల మార్పిడి చికిత్సలకు సంబంధించి ప్రపంచంలోని పలువురు నిపుణులతో కలిసి పనిచేసిన అనుభవం వుంది. నెల్లూరు అపోలోలో ఆయన వైద్యసేవలు కూడా అందుబాటులో ఉంటాయి. త్వరలో అపోలోలో ఎమర్జెన్సీ, హెడ్‌ఇంజురి, రహదారి ప్రమాదాలలో గాయపడిన వారికి చికిత్స, పాలిట్రామా ఆర్థోపెడిక్స్, స్పైన్ సర్జరీలు, ఆర్థ్రోస్కోపి, నావిగేషన్‌తో జాయింట్ రీప్లేస్‌మెంట్, చెవి, ముక్కు, గొంతు, విభాగం, గుండె, లివర్, కిడ్నీ, న్యూరాలజీ, క్యాన్సర్, దంతవైద్యం, చిన్నపిల్లల విభాగం, ప్లాస్టిక్ కాస్మోటిక్ సర్జరీ, రూమటాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, డయోబెటాలజి, ఎండోక్రైనాలజీ, ఆప్తల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, గైనకాలజి, నెఫ్రాలజి, యూరాలజీలతో పాటు అన్ని విభాగాలకు సంబంధించి నైపుణ్యం కలిగిన వైద్యులతో నిరంతరం చికిత్స అందించబోతుంది.


ఉత్సవాల వాల్‌పోస్టర్ల విడుదల

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకే ప్రాధాన్యం

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి**

ఈ నెల 25 నుంచి నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగనున్న సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసే ప్రముఖులకే కాక, సామాన్య భక్తులకు కూడా మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా, విఐపిలకు నిర్ణీత వేళలను కేటాయించాలన్నారు. పెద్దసంఖ్యలో విచ్చేసే మహిళాభక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగుకుండా చూడాలన్నారు. తాను కూడా సాధారణ భక్తుడిగానే అమ్మవారిని దర్శించుకుంటానని, అందరికీ అమ్మవారి దర్శనభాగ్యం కలిగేవిధంగా ఏర్పాట్లు చేయాలని ఈ సమావేశంలో పాల్గొన్న నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. ఈ సందర్భంగా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి భద్రతను పర్యవేక్షిస్తామని డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల రెడ్డి, ఆలయ ఇఓ పాయసం నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# సమాజాభివృద్ధిలో ఇంజనీర్లదే ప్రధానపాత్ర


**జిల్లా కలెక్టర్ ఎన్. శ్రీకాంత్**



సమాజాభివృద్ధిలో ఇంజనీర్లు ప్రధానపాత్ర పోషించాలని, ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. ఈ నెల 15న నెల్లూరు ఇరిగేషన్ ఇంజనీర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్ల దినోత్సవంగా నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమని, ఇంజనీరింగ్ రంగానికే కాక, అందరికీ గర్వకారణమని అన్నారు. దేశంలో ఆయన ఎన్నో ప్రాజెక్టులు నెలకొల్పారని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు నిరుపమానమైనవని కలెక్టర్ కొనియాడారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన భారతరత్న అవార్డును కూడా పొందిన విశ్వేశ్వరయ్య జాతికే కీర్తిప్రతిష్టలు తెచ్చారని ఆయన ప్రశంసించారు. నేటి ఇంజనీర్లు కూడా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో సమాజానికి అవసరమయ్యే మంచినీటి సరఫరా, సాగునీరు, రోడ్లు భవనాలు, డ్రైనేజీల వ్యవస్థ వగైరా పనులకు సంబంధించిన నిర్మాణాలను ఎంతో నాణ్యతగా శాశ్వతంగా వుండేలా రూపొందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ జాయింట్ కలెక్టర్ ఎం.డి ఇంతియాజ్ మాట్లాడుతూ, మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ప్రస్తుతించారు. ఇంజనీర్లందరూ ఆయనను మార్గదర్శకం చేసుకోవాలన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా రక్తదానం చేసిన పలువురు ఇంజనీర్లకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రిటైర్ట్ సి.ఇ ప్రభాకరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ కోటేశ్వరరావు, సోమశిల ఎస్ఇ సాబ్జాన్, వివిధ డివిజన్లకు చెందిన ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బాలల దినోత్సవ కానుక...
లాయర్
చిన్నారుల విజయ దీపిక



'పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందును సుమతీ'

... అన్నట్లుగా బిడ్డ జన్మించినప్పటికంటే, ఆ బిడ్డ ప్రతిభతో రాణించి అందరి ప్రశంసలందుకున్నప్పుడు ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులే వుండవు. కంటి పాపల్లాంటి మీ ఇంటి పాపాయిలు సాధించిన ఘనతలను, సాధిస్తున్న ఘన విజయాలను సమాజానికి తెలియజేసి వారికి సముచితమైన గౌరవాన్ని, మరింత ప్రోత్సాహాన్ని అందించాలని సంకల్పించింది మా(మీ) లాయర్.మన జిల్లాలో బాల మేధావులు, బాల కళాకారులు ఎందరో వున్నారు. అదేవిధంగా, క్రీడా రంగంలోనూ, వివిధ కళారూపాల ప్రదర్శనల్లోనూ, మేటిగా.. ధీటుగా వున్నవారూ.. అత్యద్భుతమైన మేధస్సుతో పిల్లలు కాదు.. పిడుగులన్నట్లుగా రాణిస్తున్నవారూ ఎందరో వున్నారు. నాట్యంలోనూ, గానంలోనూ, సంగీతంలోనూ.. చిత్రలేఖనంలోనూ... ఇలా ఎన్నో రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను చాటుకుంటూ సింహపురి కీర్తిబావుటాను రెపరెపలాడిస్తున్న చిన్నారులు అనేకమంది వున్నారు. అలాంటివారి ప్రతిభకు దర్పణంగా.. చిన్నారులందరికీ తీపి జ్ఞాపికగా వుండేలా ఒక ప్రత్యేక అనుబంధాన్ని.. రంగుల గ్రంథంగా అందించేందుకు లాయర్ వారపత్రిక సంసిద్ధమైంది. ఈ బాలల దినోత్సవం (నవంబరు 14, 2014) నాడు సింహపురి చిన్నారిలోకానికి చిరుకానుకగా... అందరూ పది కాలాల పాటు పదిలపరచుకునే విధంగా.. సర్వాంగసుందరంగా.. లాయర్ 'చిన్నారుల విజయదీపిక'ను రూపొందిస్తోంది. అందుకు మీ అందరి సహకారాన్ని కోరుతున్నాం.. మీ చల్లని దీవెనలను ఆకాంక్షిస్తున్నాం. 'రేపటి తరం' ప్రతిభా విశేషాలను నేటితరం వారికి తెలియజెప్పడానికి లాయర్ చేస్తున్న ఈ బృహత్తర కృషిలో మీ అందరూ భాగస్వాములు కావాలని మనసారా కోరుతున్నాం. ఆయా రంగాల్లో మీ చిన్నారులు చేస్తున్న కృషిని, వారు సాధించిన బహుమతులు, పొందిన బిరుదులూ, ప్రశంసలూ వగైరా వివరాలన్నిటినీ వీలైనంత క్లుప్తంగా, బాగా అర్థమయ్యేలా రాసి, చిన్నారుల ప్రతిభా వివరాలతో పాటు సంబంధిత ఫోటోలను జతచేసి, మీ చిన్నారి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను, మీ చిరునామా, ఫోన్ నంబరుతో పాటు, మీ చిన్నారి చదువుకుంటున్న పాఠశాల పేరు, ఆయా రంగాల్లో ప్రోత్సాహం అందిస్తున్న గురువుల పేర్లు కూడా జతపరచి మాకు పంపవలసిందిగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకూ, ఆయా పాఠశాలల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. వీలైనంత ఎక్కువమంది చిన్నారులకు వేదికగా వుండేందుకు, వీలైనంత సంక్షిప్తంగా ఆ వివరాలను పంపగలరని కోరుతున్నాం. ఎల్‌కెజి నుంచి 10వ తరగతి దాకా చదువుకునే మీ చిన్నారుల ప్రతిభా విశేషాలను మాత్రమే మాకు తెలియజేయండి.

అక్టోబర్ 15వ తేదిలోగా ఆ వివరాలు మాకు చేరేలా రాసి పంపగలరని కోరుతున్నాం!..



చిరునామా: లాయర్ వార పత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్,
నెల్లూరు - 524 003. ఫోన్: 0861 - 2323485. సెల్: 98663 14741.



## దంత త్యాగం

విలక్షణ నటుడు విక్రమ్ తాను నటించే సినిమాలో ఒరిజినాలిటీ కోసం ఎంత సాహసానికైనా ఒడిగడతాడు. 'ఐ' సినిమాలో వేర్‌వోల్ఫ్ పాత్ర కోసం తన పై రెండు దంతాలను తీపించి, సినిమా పూర్తయ్యాక మళ్ళీ ఆ దంతాలను అమర్చుకున్నాడు.

## మూ'వీ'క్షణం



## సంక్రాంతికి 'గోపాల గోపాల'

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, విక్టరీ వెంకటేష్ కలిసి నటిస్తున్న 'గోపాల గోపాల' చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. హిందీలో ఘన విజయం సాధించిన 'ఓమై గాడ్' ఆధారంగా తెలుగులో ఈ చిత్రం రూపొందుతుంది. మోడరన్ కృష్ణుడిగా పవన్ కల్యాణ్, దేవుడుపై కేసు వేసే గోపాలరావు పాత్రలో వెంకటేష్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఓ హాస్పిటల్‌లో పవన్, వెంకీలపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు.

## ట్రిపుల్ ధమాకా..

దక్షిణాదిని ఓ ఊపు ఊపుతున్న ఇలియానాకి ఒకేసారి బాలీవుడ్‌లో మూడు సినిమా ఆఫర్లు వచ్చాయి. మొదటి సినిమా షారూక్‌ఖాన్‌తో జోడీ కట్టనుంటే, రెండవ సినిమా రణబీర్‌కపూర్‌తోను, మూడవ సినిమా సల్మాన్‌ఖాన్ సరసన చేయనుంది. ఈ సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి సెట్స్ మీదకు రానున్నాయి.



## గూడూరు డివిజన్ వార్తలు

## ప్రభుత్వ కార్యాలయాలకు ఇసుక



అధికారులతో సమీక్షిస్తున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

గూడూరు మండలం లోని చెన్నూరు – విందూరు గ్రామ శివారు ప్రాంతాల్లో కైవల్యానది పరివాహక ప్రాంతాల్లో పోలీసులు 14వతేదీ స్వాధీనం చేసుకొన్న ఇసుక నిల్వలను నెల్లూరు నగరంలో ప్రభుత్వ కార్యాలయాలకు తరలిస్తున్నట్లుగా గూడూరు తహశీల్దార్ వెంకట నారాయణమ్మ తెలిపారు. పోలీసులు దాడులు చేసి ఇసుక నిల్వలను స్థానిక వీఆర్వోకు అప్పగించారు. దాదాపు 17టిప్పర్ల ద్వారా అధికారుల అనుమతితో నెల్లూరులో ప్రభుత్వ ఆధీనంలో నిర్మిస్తున్న భవనాలకు తరలిస్తున్నామన్నారు.

## ప్లాస్టిక్ రహిత గూడూరే లక్ష్యం

### - మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పిలుపు నిచ్చారు. పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ప్లాస్టిక్ నిర్మూలన చర్యలపై కౌన్సిలర్లు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో భావి తరాలు ఎంతో నష్టపోతాయని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు దీనిని తెలుసుకొని వాటిని వాడడం నిషేధించాలని పిలుపు నిచ్చారు. వ్యాపారులు వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు ఇవ్వకుండా కట్టడిచేయాలని కోరారు. వార్డులోని ప్రజలు ప్లాస్టిక్ వాడకుండా బాధ్యత తీసుకొంటామని కౌన్సిలర్లు తెలిపారు. కమీషనర్ అనురాధ మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని, అన్ని వార్డుల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని, వ్యాపారులందరూ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చూడాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కమిషనర్ అనురాధ, హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

## నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కె.చౌడేశ్వరి కోరారు. గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్‌పేట కూడలి వద్ద నుండి గడియారపు స్థంభం కూడలి వరకు నారాయణ ఇంజనీరింగ్, డీఆర్ డబ్ల్యూ కళాశాల విద్యార్థులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ చౌడేశ్వరి మాట్లాడుతూ నేరాలను అదుపులోకి తెచ్చేందుకు ప్రజల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగిన వెంటనే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే మోటారుసైకిలుపై ముగ్గురు ప్రయాణించడం, మద్యం తాగి వాహనం నడపడం, ధూమపానం చేస్తూ చరవాణిలో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం వలన ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కళాశాలల్లో, బస్టాండ్, ఇతర కూడళ్ళలో విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ మధుసూదనరావు, ఒకటవ పట్టణ ఎస్సై బాబి, అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ కె.చౌడేశ్వరి, రూరల్ సిఐ మధుసూధనరావు, ఎస్సైలు బాబి, అజయ్‌కుమార్

## గౌతమికి ఆర్థికసాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ఐసి సీనియర్ డీవో శివసుబ్రహ్మణ్యం, ప్రక్కన రాజారాంజయశంకర్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నెల్లూరు డివిజన్ పరిధిలో గూడూరు బ్రాంచి నందు సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎ.శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏజెంటుగా పనిచేస్తున్న రాజారాం జయశంకర్, గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గౌతమి అను విద్యార్థినికి వైద్యచికిత్స నిమిత్తం విరాళాలు సేకరించే సత్కార్యంలో భాగంగా జయశంకర్ వారి తోటి స్నేహితులు కె.వెంకటేశ్వర్లరావు సౌజన్యంతో ఎల్ఐసి నెల్లూరు సీనియర్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్‌బాబు చేతులమీదుగా రూ.5000/–లు నగదు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల తోటి విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌డిఎమ్ మాట్లాడుతూ సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శివసుబ్రహ్మణ్యం గూడూరు బ్రాంచ్‌లో 2014–15 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రీమియం సేకరించి ప్రథమస్థానాన్ని అలంకరించడమే కాకుండా, ఆయన వారి ఏజెంట్లందరికి మార్గనిర్దేశకం వహిస్తూ వారిని విజయపథాన నడిపిస్తున్నందుకు వారికి శుభాభినందనలు తెలియజేశారు.

## ఎస్‌వి రత్నం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ

గూడూరులోని ఎస్వీ రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 14వ తేదీ ట్రస్టీ ఛైర్మెన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు వారి అన్న ఎస్.నాగరాజారావు కలిసి విద్యాసామాగ్రిని చిల్లకూరు మండలం, తొనుకుమాలలోని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులకు అవసరమైన నోటుపుస్తకాలు, పలకలు, జామెంట్రీ బాక్సులు, ప్యాడ్లు, ఇతర సామాగ్రిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.ప్రభాకర్‌కు అందజేశారు. తన తల్లి సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ రామకృష్ణ, ప్రజేంద్ర, కొండయ్య, టి.శ్రీనివాసులు, పి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరు సాయినగర్‌లో వున్న సాయిబాబా మందిరంలో పనిచేస్తున్న పూజారి శ్రీనివాసమూర్తి కుమార్తె వైష్ణవికి సిఏ చదివేందుకు ఫీజు నిమిత్తం రూ.10,000/–లు ఆమె తండ్రికి ట్రస్టు ఛైర్మెన్ రామ్మోహన్‌రావు అందజేశారు.





వైష్ణవి తండ్రి శ్రీనివాసమూర్తికి చెక్కును, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయునికి విద్యాసామాగ్రిని అందజేస్తున్న ట్రస్ట్ ఛైర్మెన్ రామ్మోహన్‌రావు

## మేషం


అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించినంత ఆదాయం ఉండదు. ఆర్థిక విషయాలలో నిర్ణయాలు తొందరపడి తీసుకొనవద్దు. అవసరాలకు డబ్బు అందుతుంది. అయినవారితో విభేదాలు లేకుండా సర్దుబాటు చేసికొనండి. కుటుంబసౌఖ్యం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి సామాన్యంగా ఉంటుంది. కుటుంబఖర్చులు, దూరప్రయాణ ఖర్చులు పైన అదనం కాగలవు. పనులు జరగడానికి బాగా శ్రమ తీసికొంటారు. టెన్షన్ పడుతుంటారు. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత, స్టాక్ మార్కెట్ లాభాలుంటాయి. స్థిరాస్తులపై ఆదాయం, కొత్త పెట్టుబడులకు ఆహ్వానాలందుకొంటారు.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికస్థితి బాగుంటుంది. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కొత్త పనులు, పెట్టుబడులు జరుపుతారు. అధికారులకు బాధ్యతలు మారడం, స్థానం మారడం ఉంటుంది. తలపెట్టిన పనులు నిదానంగా జరగడం వల్ల అసహనానికి లోనుకాగలరు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ అవకాశాలు, బ్యాంకు ఋణాలు పొందుతారు.

## వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తి ఉపాధి పథకాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరిగినా, అదనపు ఖర్చులు నిలువరింపలేకపోతారు. అనుకున్న పనులను ఉత్సాహంగా జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. ఇతరులకు ధన, మాట రూపంలో సహాయపడతారు. ఉద్యోగులకు అధికారులలు పనిభారం పెరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 19.9.2014 నుండి
తేది. 25.9.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, సింహంలో శుక్రుడు, కన్యలో రవిబుధ రాహువులు, 20తేదీ నుండి తులలో బుధుడు, తులలో శని, వృశ్చికంలో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 21 ఆదివారము శుక్రమౌఢ్యమి ప్రారంభము
తేది 23 మంగళవారము మహాలయ అమావాస్య
తేది 25 నవరాత్రి పర్వదినముల ప్రారంభము

**భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | ఏకాదశి | రా॥గం.2.28వ॥ |
| తేది. 20 | శని | ద్వాదశి | రా॥గం.4.58వ॥ |
| తేది. 21 | ఆది | త్రయోదశి | పూర్తిగ |
| తేది. 22 | సోమ | త్రయోదశి | ఉ॥గం.7.5వ॥ |
| తేది. 23 | మంగళ | చతుర్దశి | ఉ॥గం.9.3వ॥ |
| తేది. 24 | బుధ | అమావాస్య | ఉ॥గం.10.48వ॥ |
| **ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు** | | | |
| తేది. 25 | గురు | పాడ్యమి | ప॥గం.12.12వ॥ |

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు. ఋణం కాని, ఇతర చోట్ల డబ్బు సర్దుబాటు చేసుకొనవలసి వస్తుంది. పరిశ్రమల యజమానులు, పెట్టుబడిదార్లకు అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. బంధువర్గంతో వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించండి. అనుకున్న పనులను జరుపుకొంటారు. ఉద్యోగులకు గుర్తింపు బాగుంటుంది.

## మిథునం


మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనుగోలు ప్రయత్నాలు జరుగుతాయి. వృత్తి వ్యాపారములు జీవనము కలిగిన వారికి ఆదాయం అభివృద్ధి ప్రయత్నాలు సంతృప్తికరంగా ఉంటాయి. అవసరాలకు ఋణాలు చేయడం, వస్తు వాహన రిపేర్లుండవచ్చును. ప్రయత్న పూర్వకంగా లభించిన అవకాశాలవల్ల మేలు జరుగుతుంది. శుభ కార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి జీవనం కలవారికి బాగుంటుంది. వ్యాపార జీవనంలో ఒడుదుడుకులు, రాబడి సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, అనుకున్న ముఖ్య పనులు ఆలస్యం కావచ్చును. స్థిరాస్తుల విక్రయాలు, శుభకార్య నిర్ణయాలలో తొందరపడవద్దు. ఆర్థికంగా నిర్ణయాలు తీసికొనవలసివస్తే పెద్దల సలహాలు అవసరం కాగలవు. ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయం తగినట్లుగా ఖర్చులు సర్దుబాటు చేసుకొంటారు. వ్యాపారవర్గాలకు ఆదాయవృద్ధి స్వల్పంగా ఉంటుంది. కుటుంబంలో అవగాహన లోపం వల్ల చిన్న సమస్యలుండవచ్చును. ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగులు కొత్త బాధ్యతలు చేపట్టగలరు. అనుకున్న పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. అధికారులకు స్థానచలనం, నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబ వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. వ్యాపారవర్గాలకు అవకాశాలు ఆగిపోవడం, సహాయపడవలసిన వాళ్ళు ముఖం చాటు చేయడం ఉంటుంది. ఆదాయం వృత్తి వ్యాపారాలలో తగ్గవచ్చును. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి, పారిశ్రామికవేత్తలకు కొత్త ప్రాజెక్టులు లభించగలవు. బంధువర్గ ముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. శుభకార్య విషయాలపై, కుటుంబ విషయాలపై దృష్టిపెడతారు.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బంధుమిత్రుల సాయంతో కలిగిన ఇబ్బందులను దాటుతారు. ఉద్యోగులపై అధికారుల, ప్రభుత్వ వత్తిడి, పనిభారము ఉంటుంది. ఆదాయం సామాన్యంగా ఉండి అదనపు ఖర్చులు పెరుగుతాయి. పిల్లల వల్ల సమస్యలు రావచ్చును. ఆకర్షణీయమైన పథకాలతో వృత్తి వ్యాపారాలలో ముందుకు సాగుతారు. ఇతరుల విషయాలలో చొరబాటు చేయకండి.

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, కొత్త వ్యాపార భాగస్వామ్య అవకాశాలుండగలవు. ఒప్పందాలలో నిశిత పరిశీలన అవసరం. ఆదాయ వ్యయాలు సంతృప్తికరము. బంధువర్గ ముఖ్యులకు అనారోగ్యము, కోర్టు కేసులందు కొంత ప్రతికూలత ఉంటుంది. నిర్ణయాలు చేయలేని స్థితి ఉంటుంది. ఇతరుల సహకారంతో పనులు సాగిస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు రావడం వల్ల టెన్షన్ ఉంటుంది. వ్యాపార వర్గాల వారు అభివృద్ధి పథకాలు ఆచరణలో పెడతారు. ఆదాయ లోపం ఉండదు. కొత్త కాంట్రాక్టులు, పెట్టుబడులకు తొందరపడవద్దు. అదనపు ఖర్చులుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. శుభకార్య ప్రయత్నాలు, ప్రయాణాలు వాయిదా పడగలవు.

# ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



శివరామయ్యాచార్యులను సత్కరిస్తున్న ముంగమూరు

విశ్వబ్రాహ్మణుల్లో ఉన్న ప్రతిభను మరింత మెరుగు పరిచేందుకు ప్రోత్సహించాలని, పంచవృత్తులకు చెందిన వారిని, సమాజసేవకులను సత్కరించడం అవసరమని మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ చైతన్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముంగమూరు మాట్లాడారు. ఈ సందర్భంగా "నైపుణ్యమిత్ర" పురస్కారాలను అందుకున్న ఆలూరు రాము ఆచారి(సూక్ష్మకళాకారుడు, మనుబోలు), కంభంపాటి బ్రహ్మయ్య ఆచారి(కమ్మవరం, బుచ్చిరెడ్డిపాళెం), కురిచేటి శివరామయ్య ఆచారి(స్వర్ణకారుడు, నెల్లూరు), అప్పసముద్రం శేషాచార్యులు(వాస్తుశిల్పి, అప్పసముద్రం), మెరుమూరి కృష్ణమూర్తి ఆచారి(కంచవరం, నెల్లూరు), మహంకాళి వెంకటరమణయ్యాచారి (దారుశిల్పి, నెల్లూరు), పాలకొండ వీరన్న ఆచారి(శిల్పి, తిరుపతి)లను సత్కరించారు. సమాజసేవకు తమవంతు సహకారం అందిస్తున్న అలిమేలి మాధవయ్య ఆచారి(దాత, నెల్లూరు), కురిచేటి శివకుమార్ ఆచారి (రచయిత, నెల్లూరు), ఇనమనమెళ్ళూరు కేశవాచారి (ఉత్తమ ఉపాధ్యాయుడు, నెల్లూరు), బొల్లోజి శ్రీనివాసాచారి(హార్మోనిస్టు, నెల్లూరు)లకు "సమాజబంధు" పురస్కారాలను అందజేశారు. విశ్వబ్రాహ్మణ చైతన్య సేవాసంస్థ వ్యవస్థాపకుడు రొంపిచర్ల శివరామయ్య ఆచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# నేత్రదానం



నెల్లూరులోని నవాబ్‌పేట వాస్తవ్యులు, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ మాజీ అధ్యక్షులు చుందూరు వెంకటకృష్ణయ్య(81) ఈనెల 13న పరమపదించారు. ఆయన కోరిక మేరకు, మరణానంతరం నేత్రదానం చేశారని, నేత్రదాత కుటుంబ సభ్యుల కోరిక మేరకు డాక్టర్ పివిఎల్ రావు ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎండిబి ప్రసాద్ ఆయన నేత్రాలను సేకరించారని నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ అధ్యక్షులు తిరివీధి కిషోర్, అయితా భాస్కర్, మంచికంటి సుబ్రహ్మణ్యం, అరవింద్ తదితరులు పాల్గొని నేత్రదాత చుందూరు సేవలను ప్రస్తుతిస్తూ ఘనంగా నివాళులర్పించారు.




# 'గీతాంజలి'లో రక్తదాన శిబిరం

ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే సందర్భంగా ఈనెల 15న కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సుబ్బారావు మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో రక్తదాన శిబిరంలో పాల్గొని, 110 యూనిట్ల రక్తాన్ని డిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యశాల రక్తనిధికి అందజేశారని అన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో వున్న అపోహలను తొలగించేందుకు తమ కళాశాల తరపున పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్. సుధాకరరెడ్డి, డిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యశాల రక్తనిధి ఇన్‌ఛార్జి డా.శేషారత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రంజిత్ కృష్ణ, కళాశాల పి.డి అశోక్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వృద్ధులకు చేయూత


పప్పుదినుసులను అందజేస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం, శింగంశెట్టి మురళీ, బి.వి.నరసింహం, తమ్మినేని పాండు

నెల్లూరుజిల్లా దాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన గీతామయి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు బియ్యం, ఇడ్లీ రవ్వ, మినపప్పు పంపిణీ చేశారు. వృద్ధులకు చేయూతగా ప్రతినెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగింది. శింగంశెట్టి మురళీ, బి.వి నరసింహం, తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

## పేదల మెట్రోషోరూం

# సండేమార్కెట్

సండేమార్కెట్ పేదలకు ఒక మెట్రో షోరూం లాంటిదని నెల్లూరు సిటి ఎమ్మెల్యే పి. అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన సండేమార్కెట్ 30వ వసంతోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో తన విజయానికి సండేమార్కెట్ వ్యాపారులు సహకరించారన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరాలో గోల్‌మాల్

నెల్లూరు నగరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరాలో లక్షల రూపాయలు గోల్‌మాల్ జరుగుతోందని, దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, డిప్యూటి కమిషనర్ వీరభద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బుజబుజనెల్లూరులో 14ట్యాంకులు, కొత్తూరులో 4, వైయస్సార్ నగర్‌లో 1ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నట్లు దొంగలెక్కలు చూపుతున్నారన్నారు. ఇందుకుగాను నెలకు రూ. 13 లక్షలు వంతున ఏడాదికి రూ. 1.53కోట్లు రెండేళ్ళుగా డ్రా చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇలాంటి అక్రమాలు జరగకుండా చూడాలన్నారు.



ఈ నెల 12వ తేదీన పొదలకూరు మండలం బిరదవోలు ఎస్సీ కాలనీలో వాటర్‌ట్యాంకును ప్రారంభిస్తున్న సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

# పోలేరమ్మ జాతరకు పోటెత్తిన జనం






వెంకటగిరిలో పోలేరమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాల నంత జనం. వెంకటగిరి అంతా జనసందోహంతో నిండిపోయింది. ఎంతో ప్రసిద్ధమైన ఈ అమ్మవారి జాతరకు జిల్లాలోని వారే కాక, ఇరుగుపొరుగు జిల్లాల నుంచి, రాష్ట్రం నలుమూలల నుంచే కాక, తమిళనాడు, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మడిభిక్షం నెత్తిన పెట్టుకుని చిన్నారులు వీధుల్లో కోలాహలంగా తిరుగుతూవుంటే, వేపమండల తోరణాలు అమ్మవారిని స్వాగతిస్తుంటే,అమ్మవారికి పూజలు చేసి, అంబలి తయారుచేసి, వచ్చిన బంధువులకు, స్నేహితులందరికీ పంచిపెడుతూ వెంకటగిరివాసులు ఈ జాతరను ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆపదలనుంచి గట్టెక్కించే తల్లి,.. అందరినీ కాపాడే కల్పవల్లి పోలేరమ్మ తల్లి.. అంటూ భక్తులు అమ్మవారి నామస్మరణతో పులకించిపోయారు. వెంకటగిరి గ్రామశక్తి అయిన పోలేరమ్మ అమ్మవారికి ఎంతో కాలం నుంచి సంప్రదాయబద్ధంగా, ఎంతో వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.

దాదాపు మూడువందల సంవత్సరాల కిందటినుంచే అమ్మవారికి ప్రతిఏటా పెద్దఎత్తున జాతర చేయడం ప్రారంభమైనట్లు స్థానిక పెద్దలు చెప్తున్నారు. భక్తుల పాలిట కల్పవల్లిగా, కోరిన కోర్కెలు తీర్చే వరాలతల్లిగా పోలేరమ్మ అమ్మవారు ప్రసిద్ధి. అమ్మవారికి ఏడు తరాలుగా పుట్టినిల్లుగా భావించే కుమ్మరివీధిలోని ఒక కుమ్మరివారింట సంప్రదాయ బద్ధంగా అమ్మవారి విగ్రహాన్ని రూపొందించి, జాతర నిర్వహిస్తుండడం ఆనవాయితీ. జిల్లాలో ఎంతో ప్రసిద్ధంగా జరిగే జాతరల్లో పోలేరమ్మ జాతర ఎంతో ప్రధానమైనది. జాతర రోజున వెంకటగిరి భక్తజనంతో నిండిపోతుంది. ఆ కోలాహలం చెప్పనలవి కాదు. వెంకటగిరిలో ప్రధానమైన బజారువీధి మరింతగా కిటకిటలాడింది. వెంకటగిరి లోని అన్నివీధులూ, కూడళ్ళలో ఎక్కడ చూసినా భక్తజనమే. మంగళవారం నుంచే వెంకటగిరికి వచ్చే వాహనాల్లో రద్దీ పెరిగింది. జాతరకు ప్రధానమైన బుధ, గురు వారాల్లో వెంకటగిరికి వచ్చే రైళ్ళు, బస్సులు, ఇతరత్రా వాహనాలన్నీ భక్తజనంతో క్రిక్కిరిసిపోయాయి. ఎంతో వేడుకగా జరిగిన ఈ జాతరలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ రవీంద్రరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి వై.రామచంద్రరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# గ్రాండ్‌గా జేసీస్ అవార్డుల వేడుక




జేసీస్ గ్రాండ్‌డే కార్యక్రమం ఈ నెల 14న నెల్లూరు టౌన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 67మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. అలాగే వివిధ రంగాలలో ప్రతిభావంతులైన వారికి జేసీస్ అవార్డులు అందజేశారు. పువ్వాడి రాజశేఖర్, సంపత్‌కుమార్, సుగందినిలకు టాయ్ పురస్కారాలను, గుండ్లపల్లి మోహన్‌రావుకు కమలపత్ర పురస్కారాన్ని, డాక్టర్ ఫణికృష్ణ, అమరా మోహన్‌రావు, బయ్యా శ్రీనివాసులు, వై.అమృతవల్లిలకు టెన్‌అవుట్ స్టాండింగ్ యంగ్ బిజినెస్‌మెన్ అవార్డులను అందజేశారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ద్వారకానాథ్, జేసీస్ పిడి కోటా సత్యనారాయణ, జేసీస్ అధ్యక్షుడు సి.వి.శరణ్‌కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ, జేసీ రైట్స్ ఛైర్‌పర్సన్ సి.ఉమారాణి పాల్గొన్నారు.

# సిఎంఆర్‌లో రక్తదాన శిబిరం



చందన, సిఎంఆర్ సంస్థల వ్యవస్థాపకుల్లో ఒకరైన మావూరి సత్యనారాయణ 67వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో వందమంది సిఎంఆర్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 25 నుంచి చెంగాళమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు



భక్తుల కొంగుబంగారమైన సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి వైభవోపేతంగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 25వ తేది ఉదయం9.37 నుంచి 11.51 వరకు అమ్మవారికి జరిగే విశేషపూజలు, కలశస్థాపనతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆరోజున అమ్మవారికి పరమేశ్వరి అలంకారం నిర్వహిస్తారు. అదేవిధంగా, 26న బాలత్రిపుర సుందరి అలంకారం, 27న గాయత్రి అలంకారం, 28న అన్నపూర్ణ అలంకారం, 29న అష్టకాళీ అలంకారం, 30న మహాలక్ష్మి అలంకారం, వచ్చే నెల 1న దుర్గాష్టమి సందర్భంగా సరస్వతీ అలంకారం, 2న మహర్ణవమిని పురస్కరించుకుని అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారం వైభవంగా నిర్వహిస్తారు. 3వ తేది విజయదశమి సందర్భంగా మహిషాసురమర్ధిని అలంకారం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 9.30 గంటల నుంచి తెనాలి మ్యూజికల్ బ్యాండ్, ఆర్కెస్ట్రాతో మరింత వేడుకగా గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకారాలు, నవ దుర్గల హోమాలు నిర్వహిస్తారు. 25న లలితా యాగం, 26న బాలత్రిపురసుందరి యాగం, 27న గాయత్రి యాగం, 28న కాత్యాయని యాగం, 29న దుర్గా యాగం, 30న మహాలక్ష్మి యాగం, 1న సరస్వతీ యాగం, 2న చండీ యాగం, 3న లలితా యాగం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్యప్రాజెక్టు వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించాలని నిర్వాహకులు కోరారు.

# ఒరిగేదేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా పరిపాలనపైనే దృష్టిపెట్టారు. కాని ఈలోపే ఉపఎన్నికల ఫలితాలు చూసి ప్రజలకు మోడీపై భ్రమలు తొలిగిపోయాయని ప్రచారం చేయడం విడ్డూరంగా వుంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో చూస్తే చంద్రబాబు పాలన వందరోజులు పూర్తయ్యిందని, ఈ వందరోజుల్లోనే ఎన్నో ఘన కార్యాలు సాధించామని తెలుగుదేశం వాళ్ళు సంబరాలు చేసుకోవడం కూడా విడ్డూరంగా వుంది. వందరోజుల్లోనే ఏం ఒరుగుతుందని సంబరాలు చేసుకోవాలి. అలాగే వందరోజుల్లో ఏం జరుగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం కూడా అర్థరహితం. ఈ నూరురోజుల్లో అద్భుతాలు ఆశించడం ఎంత మూర్ఖత్వమో, విజయాలు సాధించామని అధికారపక్షం చంకలు గుద్దుకోవడం కూడా అంతే అమాయకత్వం. చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజు చేసిన ఐదు సంతకాలకే ఇంతవరకు దిక్కు లేకుంటే, ఇంకేం సాధించారని సంబరాలు చేసుకోవాలి.

# 'టీ'కి ఎల్ అండ్ టి షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఎల్ అండ్ టి ముందుకొచ్చింది. ప్రపంచంలోనే అత్యుత్తమ నిర్మాణ సంస్థల్లో ఎల్ అండ్ టి ఒకటి. మన దేశంలో అగ్రశ్రేణి నిర్మాణ సంస్థ. దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్నప్పుడు హైదరాబాద్‌కు మెట్రో ప్రాజెక్టు మంజూరైంది. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టి పనులు మొదలు పెట్టింది. దాదాపు 5వేల కోట్ల రూపాయల మేర ఖర్చయ్యింది. అయితే ఆ తర్వాత కేంద్రం తెలంగాణను ప్రకటించడం, రాష్ట్ర విభజన జరిగిపోవడం, తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రావడం జరిగాయి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యింది మొదలు మెట్రో పనులకు అవరోధాలు సృష్టించసాగారు. మెట్రో ప్రాజెక్ట్ డిజైన్‌లో మార్పులు చేయాలంటూ పట్టుబట్టారు. దీంతో ఎల్ అండ్ టి సంస్థ విసుగెత్తిపోయింది. మెట్రో పనులు మా వల్ల కాదంటూ చేతులెత్తేసింది. దీనికి కారణం ఆంధ్రప్రదేశ్‌లో లేని హైదరాబాద్‌లో మెట్రో ప్రాజెక్ట్ వల్ల ఆదాయం ఉండదని, నష్టం తప్పదని అంచనాకు రావడమే. ఈ ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే దాదాపు 15వేల కోట్లు అవుతుంది. ఇప్పటికే 5వేల కోట్లు దాకా అయ్యాయి. ఇంకా 10వేల కోట్లు అవుతుందని అంచనా! కాని రాష్ట్ర విభజన జరిగాక హైదరాబాద్ స్థాయి పడిపోయింది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాజధానిని ప్రకటించినందున ఇక హైదరాబాద్ నుండి ఆంధ్రా వ్యాపారులు, ఇతర వర్గాలవారు, ఉద్యోగులు వలసవెళ్లే అవకాశముంది. మెట్రో ప్రాజెక్ట్‌ను వాడుకునేవాళ్లు తగ్గిపోతారు. దాంతో ఎన్ని టిక్కెట్లు అమ్ముకుంటే ఎల్ అండ్ టికి పెట్టుబడికి తగ్గ ఆదాయం వస్తుంది. నష్టాలు తప్పవు. ఇవన్నీ ఆలోచించే ముందు చూపుతో ఎల్ అండ్ టి సంస్థ మెట్రోకు టాటా చెప్పేపనిలో వుంది.

# కళ తప్పిన నెల్లూరు

(మొదటిపేజీ తరువాయి)

ఇలా అన్ని కమిటీలలో నారాయణను వేస్తున్నాడు. అంతేకాకుండా రాజధానిని ఏ విధంగా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేసేందుకు నారాయణనే దేశవిదేశాలకు తిప్పుతున్నాడు. ఇంతకుముందు అప్పుడప్పుడన్నా తన విద్యాసంస్థల పనిమీద నెల్లూరొచ్చే నారాయణ, మంత్రి అయ్యాక ఆ మాత్రం కూడా రాలేకపోతున్నాడు.

నారాయణతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి నాయకుడికి మంత్రి పదవి వచ్చివుంటే జిల్లాలో సందడి ఇంకో విధంగా ఉండేది. గతంలో చంద్రబాబు కేబినెట్‌లోనే సోమిరెడ్డి రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. మంత్రి పవర్ ఎలా ఉంటుందో చూపించాడు. సోమిరెడ్డి నెల్లూరొచ్చాడంటే జిల్లా అధికారయంత్రాంగమంతా ఆయన చుట్టే తిరిగేది. కార్యకర్తలు, ప్రజల పనులు కూడా అప్పుడే అయిపోతుండేవి. ఈరోజు సోమిరెడ్డికి మంత్రిపదవి లేకున్నా ఆయన ఆఫీసువద్ద జనం క్యూలు కడుతున్నారంటే కారణం గతంలో మంత్రిగా ఆయన ఆ విధంగా పనిచేసి ఉండబట్టే. ఒక్క సోమిరెడ్డే కాదు గతంలో జిల్లా నుండి మంత్రులుగా పనిచేసిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం సంజీవరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు మంత్రులుగా జిల్లాను ఒక ఊపు వూపినవారే! ఇప్పుడు మాత్రం జిల్లాలో ఆ ఊపు, హుషారు కనిపించడం లేదు.

గల్పిక

# ఆంధ్ర-తెలంగాణల మధ్య భలే ఒప్పందం

అది ప్రత్యేకవాదుల పేరుతో కేసీఆర్ కబ్జాచేసిన హైదరాబాద్ నగరం. తెలంగాణ సీఎం కేసీఆర్ నివాసం. అర్థరాత్రి తన గదిలో కేసీఆర్ గురకపెట్టి నిద్రపోతున్నాడు. అంతా ప్రశాంతంగా ఉంది. ఉన్నట్లుండి కేసీఆర్... పాతిపెడతా... గొంతు కోస్తా నా కొడకల్లారా అని కేకలు పెడుతూ లేచాడు. ఆయన మాటలతో పక్కనేవున్న ఆయన భార్య అదరగొట్టుకుని లేచింది. ఏందండి.. ఏమైందండి.. అంటూ ఆమె అడిగింది. కేసీఆర్ వుండి... పగలంతా కోస్తాం, పాతరేస్తాం అనే మాట్లాడుతుంటాను కదా... రాత్రిళ్ళు కలలో కూడా ఆ మీడియావాళ్లే గుర్తుకొస్తున్నారు. అందుకే కోపమొచ్చి ఆ విధంగా మాట్లాడుతుంటాను... నువ్వు భయపడకుండా పడుకో అని ఆమెకు చెప్పి ఈయన కూడా మంచినీళ్లు తాగి మళ్లీ పడుకున్నాడు. అలా గంట గడిచాక... "అయ్యబాబోయ్ ఎవరో నన్ను పొడుస్తున్నారు... నన్ను చంపుతున్నారు... ఎవర్రా కొడుకులు" అంటూ కేసీఆర్ లేచాడు. ఆయన గుండె భయంతో కొట్టుకుంటోంది. ఆయన అరుపుకు ఆయన భార్య లేచి... మళ్ళీ మీడియా వాళ్లు కలలోకి వచ్చారా అని అడిగింది. లేదే... ఎవరో నన్ను కత్తులతో పొడిచారు. ఒళ్లంతా మంటగా వుంది, ముందు ఆ లైట్ ఆన్ చెయ్ అని కేసీఆర్ చెప్పారు. ఆమె లైటు వేసింది. ఆ వెలుగులో చూస్తే కేసీఆర్ ముక్కు బాగా వాచిపోయింది. ఒళ్లంతా దద్దుర్లుపోయి వుంది. ఆ గదిలో వారికి కొన్ని జీవులు 'ఝుమ్'మని సౌండ్ చేస్తూ తిరుగుతూ కనిపించాయి. కేసీఆర్ సతీమణి వుండి... ఇవేవో విషపురుగులు మాదిరిగా వున్నాయండి... ఇవే మిమ్మల్ని కరచినట్లున్నాయి అంటూ వెంటనే డాక్టర్లకు ఫోన్ చేసింది. పది నిముషాల్లో 'నిమ్స్' ఆసుపత్రి నుండి పెద్దవైద్య బృందమే అక్కడ దిగింది. కేసీఆర్‌కు యూరిన్ టెస్ట్ నుండి ఏంఆర్ఐ స్కానింగ్ దాకా అన్నీ తీసి ప్రమాదమేమీ లేదని తేల్చారు.

కేసీఆర్‌ను విషజీవులేవో కరిచాయని తెలియడంతో టీ-మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ఈటెల రాజేందర్, రాజన్న, నాయని నర్సింహారెడ్డి, ఎంపీ కవిత అక్కడకు చేరుకున్నారు. ఏమైందని వాళ్లు కేసీఆర్‌ను అడిగారు. దానికి కేసీఆర్... రాత్రి వింత జీవులేవో నా మీద దాడిచేసాయి. చాలా భయంకరంగా కరిచాయి. ఇంతకుముందెప్పుడూ వాటిని నేను హైదరాబాద్‌లో చూడలేదు. ఆ వింతజీవులెక్కడ నుండి వచ్చాయి, ఎలా వచ్చాయి... వెంటనే నాకు తెలియాలి అన్నాడు. అది విని హరీష్‌రావు, కేటీఆర్, ఈటెల రాజేందర్ పగలబడి నవ్వసాగారు. అది చూసి కేసీఆర్‌కు మండి... నేనోపక్క ఆందోళన పడుతుంటే మీకు నవ్వులాటగా వుందా అని అడిగాడు. అప్పుడు హరీష్‌రావు అందుకుని... మామా, మిమ్మల్ని కరిచింది విషజీవులో, వింతజీవులో కాదు, ఐఆర్20-420 బ్రాండ్‌గల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు. వాటిని మేమే హైదరాబాద్‌కు రప్పించాం అని చెప్పాడు. వాటితో పనేమొచ్చిందిరా మీకు చచ్చుసన్నాసుల్లారా అని కేసీఆర్ అడిగాడు. అప్పుడు కేటీఆర్... వాటి విలువ తెలియక మీరు అలా మాట్లాడుతున్నారు నాన్నా, రాష్ట్ర విభజన జరిగాక హైదరాబాద్ సిటీ ఉంది కాబట్టి చైనా, జపాన్, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు మన వైపు మొగ్గుచూపాలి. కాని ఆ దేశాలు ఆంధ్రా పట్ల ఆసక్తి చూపసాగాయి. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈమధ్య ఏపి నాయకులకే ప్రాధాన్యతనిస్తున్నాడు. మన దగ్గర లేనిది వాళ్ల దగ్గర వున్నది ఏంటబ్బా అని మేం విచారిస్తే చివరకు విషయం బయటపడింది. వాళ్ల వద్ద వున్న ముదురుదోమలు మన వద్ద లేవు. నెల్లూరులో టెర్రరిజం, ఫ్యాక్షనిజం, నక్సలిజం ఎందుకు లేవనుకుంటున్నారు. ఈ దోమల దెబ్బకు భయపడే ఎవరూ అక్కడ వుండరు. కాబట్టే నెల్లూరు ప్రశాంతంగా వుంటుంది. అంతేకాదు, ఈ దోమల ద్వారా అణ్వాయుధాలను మించిన జీవాయుధాలను తయారు చేయవచ్చు. కాబట్టే విదేశాలు నెల్లూరోళ్లకు ప్రాధాన్యతనిస్తున్నాయి అని చెప్పాడు. మరి ఇంత అరుదైన జాతి దోమలను మీరు హైదరాబాద్ ఎలా తేగలిగారని కేసీఆర్ అడిగాడు. దానికి ఈటెల రాజేందర్... మీకు తెలియకుండానే మన రాష్ట్రానికి ఒక మంచి పని చేయాలనుకున్నాం, అందుకే సీక్రెట్ ఆపరేషన్ ఒకటి నిర్వహించాం. ఆ ఆపరేషన్ ఎలా చేసామో మీరే చూడండి అంటూ ఒక సిడి తీసి కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు. 'ఆపరేషన్ ముదురు మస్కిటోస్' అనే ఫైలును ఓపెన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్‌లు రాసాగాయి.

★★★★★

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని మోడీతో పాటు హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, ప్రకాశ్‌జవదేకర్‌లు వున్నారు. వారికెదురుగా కేటీఆర్, హరీష్, ఈటెల రాజేందర్, కవితలు వున్నారు. కేటీఆర్ వుండి... రాష్ట్ర విభజనలో మాకు అన్యాయం జరిగింది సార్ అన్నాడు. ఈ మాట అనాల్సింది ఆంధ్రావాళ్లు కదా, మీరంటున్నారేంటని మోడీ అడిగాడు. వెంటనే హరీష్.. విభజనతో మాకే ఎక్కువ లాభం కలిగిందని ఇంతకాలం అనుకున్నాం, కాని అసలు విషయం మాకు ఇప్పుడే తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన జరిగింది. కాని విలువైన, అరుదైన నెల్లూరుజాతి ముదురుదోమల పంపిణీ మాత్రం జరగలేదు. అవి నెల్లూరులోనే ఉండిపోయాయన్నాడు. ఆ ప్రతిపాదనను వెంకయ్యనాయుడు బలంగా ప్రతిఘటించారు. మీరు ఛార్మినార్‌ను, గోల్కొండను, హుస్సేన్‌సాగర్‌ను ఆంధ్రాకు పంచివ్వగలరా? నెల్లూరు దోమలూ అంతే! మా నెల్లూరు పాలకులు ఎంతో కష్టపడి అరుదైన దోమల జాతిని అభివృద్ధి చేశారు. వాటి కోసం మా రక్తం ధారపోసాం. ఈరోజు వాటిలో కూడా వాటా కోరడం ఏమైనా న్యాయంగా వుందా? భవిష్యత్‌లో వాళ్లు వాటినే అమ్ముకుని బ్రతకాలన్నాడు. వెంటనే ఈటెల రాజేందర్... మీరే అలా అంటే ఎలా, పెద్దమనసు చేసుకోండి, ఆంధ్రా, తెలంగాణ మీకు రెండుకళ్ల లాంటివన్నాడు. నాక్కాదు, అది చంద్రబాబుకు, ఈ విషయంలో నేను ఆంధ్రా పక్కనే వుంటానని వెంకయ్య చెప్పాడు. మోడీ అందుకుని, వెంకయ్యాజీ... మనకు రెండు రాష్ట్రాలు కావాలి, రెండు రాష్ట్రాల్లో అన్నీ ఉండాలి, నెల్లూరు నాయకులతో మీరు, అరుణ్‌జైట్లీ మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించండని చెప్పడంతో అక్కడ నుండి అందరూ లేచారు.

★★★★★

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఛాంబర్. వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ, హరీష్‌రావు, ఈటెల రాజేందర్, కేటీఆర్, కవిత, నెల్లూరు నాయకులు అజీజ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64), డాక్టర్ జడ్.శివప్రసాద్, మాజీమేయర్ భానుశ్రీలు వున్నారు. దోమల పంచాయితీ మొదలైంది. వెంకయ్య వుండి... నెల్లూరులో ఎన్ని టన్నుల దోమలు ఉన్నాయో లెక్కేసి 60-40 నిష్పత్తిలో తెలంగాణకు ఇవ్వాల్సి వుంటుందని చెప్పాడు. దానికి కోటంరెడ్డి ఒప్పుకోలేదు, నెల్లూరు మున్సిపాల్టీ ఏర్పడినప్పటి నుండి తరతరాలుగా అభివృద్ధి చేసుకుంటూ వచ్చిన దోమలను ఇప్పుడు ఫ్రీగా ఎలా ఇస్తామన్నాడు. వెంటనే వివేకా లేచి... మన దోమలను కాపాడుకునేందుకు అవసరమైతే మరో ఉద్యమం మొదలుపెడతామన్నాడు. భానుశ్రీ అయితే ఏడుస్తూ... అవి మా కుటుంబంలో ఓ భాగం, పిల్లలను వదిలేసి తల్లి ఉండగలదా... అలాగే వాటిని వదిలేసి మేము ఉండలేమంది. అప్పుడు అరుణ్‌జైట్లీ... పెద్దమనిషిగా నా మాట వినండి, మీ నెల్లూరు అభివృద్ధికి కేంద్రం నుండి అన్ని విధాలా సాయం చేస్తాం, 60-40 నిష్పత్తిలో కాకపోయినా కనీసం 20శాతమైనా ఇవ్వండని కోరాడు. వెంకయ్య ఆ ప్రతిపాదనకు సరేననడంతో నెల్లూరు పాలకులు కూడా మెత్తపడ్డారు. అక్కడే దోమల పంపిణీకి సంబంధించిన చారిత్రాత్మక ఫైలుపై అందరూ సంతకాలు చేశారు.

★★★★★

ఇక్కడితో కంప్యూటర్ స్క్రీన్ మీద దృశ్యాలు ఆగిపోయాయి. హరీష్ అందుకుని... మామా, ఇక మనం ఎవరినీ గొంతు కోయబల్లేదు, పాతరేయబల్లేదు, ఈ దోమలే ఆ పని చేస్తాయన్నాడు. వాళ్లు చేసిన 'ఆపరేషన్ ముదురు మస్కిటోస్'ను కేసీఆర్ మెచ్చుకుని నలుగురినీ శాలువాలతో సత్కరించాడు.

కదంబం

## రంగుల గాయం

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
కనిగిరి, 9948774243.

నేత్రాకర్షణ కేళీ పరవశంతో
సడలిన బిగువు గుప్పిట
పొగిలే విద్యుత్తావేశం
దేహం దేహం లోంచి
జర్రు జారిపోయాక
మూత ఊడిన ముద్దుల దాహం
మురిసిన చెంపన సేదతీరుతూ...
యవ్వనపు పచ్చదనంతో
నిగారిస్తున్న వయసు
మదిలోకి దిగబడిపోతున్న
మర్మావయాల క్రీడానందం
గుండెల్లో గుసగుస లాడుతున్న
పరాయిశ్వాస
అనిర్వచనీయమైన ముసుగులో
అవ్యక్త కసి
ఊపిరి హద్దులు చెరుపుతూ
ఇద్దర్నొకటిగా
సమ్మిశమం చేస్తున్న సంకెళ్లు
దీన్ని రెండు జీవితాలు ఏకసూత్రంగా ముడివడే
ప్రేమంటుందామె!
కాదు రెండుజీవితాల మీద
మానని రంగుల గాయమంటాను నేను!

## జిల్లా ఆలయాల పరిరక్షణ సదస్సు

నెల్లూరుజిల్లాలో వున్న ఆలయాల పరిరక్షణపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ & సేవ్ టెంపుల్స్, అమెరికా, వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొ. వెలగపూడి ప్రకాశరావు మరియు సాంస్కృతిక రాయబారి డా॥ గజల్ శ్రీనివాస్ ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సదస్సు సెప్టెంబర్ 20న ఉదయం 10గంటల నుండి 2గంటల వరకు నెల్లూరు, టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సదస్సులో దేవాలయాల ఘనచరిత్రపై ఆలూరి శిరోమణిశర్మ, వేద పాఠశాలలు, వేదాధ్యయనంపై ప్రభాకరశర్మ, గోశాలలు, గోసంరక్షణపై రాజశేఖరశాస్త్రి, దేవాలయాల భద్రతపై రవీందర్‌రెడ్డి, అర్చకుల సమస్యలపై జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు, దేవాలయాల మాన్యంపై భువనేశ్వరప్రసాద్, దేవాలయాలు సాంస్కృతిక ప్రదర్శనలపై నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడతారని, దేవాదాయ, ధర్మాదాయశాఖ సహకారంతో అలాగే స్థానిక పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి మరియు పురపాలక సంఘ మండలి సభ్యుల ప్రోత్సాహంతో నిర్వహించబడుతున్న ఈ సదస్సులో దేవాలయ బంధువులందరు పాల్గొనవచ్చునని తెలిపారు. సదస్సు అనంతరం 60మంది వేదపండితులతో గోమాత పురస్కారాలు అందజేస్తున్నామని, ఆ తర్వాత గజల్స్ శ్రీనివాస్ గజల్స్ గానం ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని నెల్లూరీయులు విజయవంతం చేయాలని వారు కోరారు.

## శ్రీ రంగనాథునికి విశేష పూజలు

భాద్రపద మాసం, అష్టమి తిథిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఊంజల్‌సేవ, తిరుమంజనం, శ్రీకృష్ణ చరిత పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను తిలకించారు. ఆలయ ఇఓ వేగూరు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కన్యాశుల్కం'ను జయప్రదం చేయండి

- జె.సి రేఖారాణి



డిడిని అందజేస్తున్న జేసీ రేఖారాణి

ఈ నెల 21వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రదర్శించనున్న ప్రసిద్ధమైన 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శనకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని జాయింట్ కలెక్టర్ రేఖారాణి కోరారు. సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు రచించిన ఈ నాటకం ఎంతో ప్రసిద్ధమైనదని, ప్రజలందరూ దీనిని తిలకించి జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ నాటక ప్రదర్శనకు జిల్లా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ 50 వేల రూపాయలు కేటాయించారని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందుకు సంబంధించిన డిడిని ఆమె మంగళవారం కన్యాశుల్కం నాటక నిర్వహణ కమిటీ కోశాధికారి కోటిరెడ్డికి అందజేశారు.

## సిఐ, ఎస్ఐలకు త్వరలో స్థానచలనం

నెల్లూరు జిల్లా పోలీసుశాఖను పూర్తిగా ప్రక్షాళన చేసే ఉద్దేశ్యంలో జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ దృష్టి సారిస్తున్నారు. దాదాపు 10 ఏళ్ళ పాటు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో తిష్టవేసుకున్న సిఐ, ఎస్ఐలకు స్థానచలనం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో స్థాన చలనానికి ముహూర్తం నిర్ణయించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల పైరవీలతో కీలకమైన పోలీసుస్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న వారిపై దృష్టిపెట్టారు. స్టేషన్లు వారీగా సిఐ, ఎస్ఐల పని తీరును గురించి ఆరా తీసినట్లు సమాచారం. అధికారుల పని తీరు పారదర్శకత, ప్రజలతో మమేకం, నిజాయితీ అనే నాలుగు అంశాలలో పేరున్న వారికి సముచిత స్థానాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. దీని పై ఇప్పటికే పూర్తి సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది.

## నిర్మాణ రంగంలో అద్భుతాలను సృష్టిస్తున్న

# మోడరన్ మాంత్రికుడు మన మోహన్‌రెడ్డి



## • నెల్లూరు విశ్వేశ్వరయ్యగా కితాబు

**నెల్లూరు నగరంలో నాలుగు దశాబ్దాల క్రితమే రోహ్‌సన్ కాన్సెప్ట్‌తో పాటు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో అధునాతన భవనాలను నిర్మించిన ఆర్కిటెక్ట్ మోహన్‌రెడ్డిని నెల్లూరు ఇంజనీర్లంతా ఘనంగా సన్మానించారు.**

సెప్టెంబర్ 15వ తేదీ ప్రపంచ ఇంజనీర్స్ డే సందర్భంగా నెల్లూరులోని డిప్లొమా మరియు డిగ్రీ హోల్డర్లైన ఇంజనీర్లు, బిల్డర్లు "ఇంజనీర్స్ డే"ని నెల్లూరు స్వర్ణవేదికలో వేడుకగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ రంగంలో సంచలనాలను సృష్టిస్తూ చెన్నై, హైదరాబాదు, బెంగుళూరులతో పాటు ముంబైలో కూడా తన ప్రతిభా నైపుణ్యంతో అద్భుతాలకు రూపకల్పన చేసిన బోగోలు మోహన్‌రెడ్డిని సత్కరించుకున్నారు. నెల్లూరులో ఎంతోమంది యువ ఆర్కిటెక్ట్‌లకు బిల్డర్లకు మోహన్‌రెడ్డి గురువు. మోహన్ & అసోసియేట్స్ ద్వారా ఎంతోమందిని తీర్చిదిద్ది సమాజానికి అందించాడు మోహన్‌రెడ్డి. గురుశిష్యుల బంధంలా కాకుండా ఒక కుటుంబసభ్యుడిలా, మిత్రుడిలా తన శిష్యులకు తర్ఫీదునిచ్చి పని నేర్పించేవాడన్న మంచిపేరు మోహన్‌రెడ్డికి ఉంది. నిర్మాణ సామ్రాజ్యంలో నెల్లూరు నుండి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మోహన్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయస్థాయిలో రాణించారు. ఆయన నెల్లూరు నుండి ముందుగా మద్రాసుకు వెళ్ళి అక్కడి నెల్లూరివాళ్ళ ఇళ్ళతో పాటు ఎంతోమంది ప్రముఖ సినిమానటుల ఇళ్ళకు డిజైన్‌లను అందించాడు. రజనీకాంత్ ఇష్టంగా కట్టిన రాఘవేంద్ర కల్యాణ మండపానికి రూపకల్పన చేసింది మోహన్‌రెడ్డే. ఢిల్లీలో సైతం పలు ప్రముఖసంస్థలకు మోహన్‌రెడ్డి నిర్మాణ సారథ్యం వహించాడు. ప్రస్తుతం తన సొంత పర్యవేక్షణలో కుమారుల సారథ్యంలో చెన్నైలో నిర్మిస్తున్న 'మయాన్స్' గేటెడ్ కమ్యూనిటీ ఇళ్ళు మద్రాసులో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇసిఆర్ రోడ్డులోని "మాయాజాల్" ప్రాంగణంలో ఈ ఇళ్ళు శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్నాయి.



### నాణ్యత, నైపుణ్యతే నన్ను ఈ స్థాయికి చేర్చింది

పుట్టినగడ్డపై తనకు తొలిసారిగా జరిగిన సత్కారానికి ఆయన తన శిష్యులందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1977లో తాను నెల్లూరులో సంస్థ మొదలుపెట్టే నాటికి ఇక్కడ అందరూ బేల్దారి మేస్త్రీలపై ఆధారపడేవారని, తొలిసారిగా నెల్లూరీయులకు ఇంజనీరింగ్‌తో పాటు ఆర్కిటెక్చర్‌ను కూడా పరిచయం చేశానని, ఈరోజు నెల్లూరులో వున్న యువఇంజనీర్లు ఆర్కిటెక్టులు యాభైశాతంకు పైగా తన శిష్యరికంలో నిర్మాణంలో మెళకువలు నేర్చుకున్నవారేనని, ఇంతమందికి గురువునైనందుకు తనకెంతో ఆనందంగా వుందని అన్నారు. 1977 నుండి 80వరకు 4 సంవత్సరాల కాలంలో నెల్లూరులో కొత్త వొరవడిని తమ సంస్థ ద్వారా సృష్టించామని మోహన్‌రెడ్డి అన్నారు. కేవలం ఇంజనీరింగ్‌తో ముగించకుండా ఆర్కిటెక్చర్‌లో కూడా పరిపూర్ణత సాధించినప్పుడే మనం చేసేపనికి సంతృప్తికరమైన ఫలితాన్ని ఇవ్వగలమని, అందుకోసమే తాను ఇంజనీరింగ్‌తో పాటుగా ఆర్కిటెక్చర్‌లో కూడా పట్టాపొంది నిర్మాణరంగంలో అడుగు పెట్టానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాల్లో ముఖ్యంగా "సేఫ్ బేరింగ్ కెపాసిటి ఆఫ్ సాయిల్" అంటే మనం నిర్మించే భవనం యొక్క స్థలంలో వున్న మట్టి పటిష్టతను బట్టి భవనం డిజైన్ చేయాలని, అప్పుడే పూర్తి భద్రతా జాగ్రత్తలతో భవనం నిర్మించగలమని అన్నారు. శంకుస్థాపన రోజు నుండి కాకుండా అంతకుముందే స్థల పరిశీలన దగ్గరనుండి భవనం పూర్తయ్యే వరకు ప్రతి అంగుళంలో ఇంజనీర్ పర్యవేక్షణ వున్నప్పుడే ఆ నిర్మాణానికి పూర్తి గ్యారంటీ వుంటుందని, భవనంలోని ప్రతి భాగంపైనా ఇంజనీర్‌కు అవగాహన కలిగినప్పుడే మంచి పటిష్టమైన నిర్మాణాన్ని యాజమాన్యానికి అందించగలమని అన్నారు.

### ఇంజనీర్లకు క్షేత్రస్థాయి నుండి సూక్ష్మ పరిశీలన అవసరం

కాంట్రాక్టర్ లేదా భవన యజమానుల వత్తిడికి లోనుకాకుండా ప్రతిస్థాయిలోనూ ఇంజనీర్ లేదా ఆర్కిటెక్ట్ జోక్యం చేసుకుని ఎక్కడా రాజీపడకుండా నిర్మాణాన్ని పూర్తి చేయగలిగినప్పుడే భవనంతో పాటు ఇంజనీర్ ప్రతిభ కూడా చిరస్థాయిగా నిలబడిపోతుందని అన్నారు. ఎక్కడైనా లోపం జరిగినప్పుడు అది బేల్దారి మేస్త్రీ తప్పో లేక కాంట్రాక్టర్ పొరపాటో అని ఇంజనీర్లు తప్పించుకునే ప్రయత్నం చేస్తే అది వారి భవిష్యత్ మనుగడకే ప్రమాదమని, క్షేత్రస్థాయి నుండి పూర్తి స్థాయి నిర్మాణం జరిగే వరకూ ప్రతి విషయంలోనూ ఇంజనీర్ సూక్ష్మ పరిశీలన అవసరమని అన్నారు. నెల్లూరులో నేడు వందమందికిపైగా ఆర్కిటెక్టులు, ఇంజనీర్లు వున్నారని వినడం తనకు చాలా ఆనందంగా వుందని, ప్రతిఒక్కరూ ఈ ప్రమాణాలను పాటించి నైపుణ్యతతో పాటు నాణ్యతకు కూడా ప్రాముఖ్యతను కల్పిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. తనకు ఇంతటి గౌరవాన్ని కల్పించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సభలో పాల్గొన్న అతిథులు తనను నెల్లూరు విశ్వేశ్వరయ్యగా పేర్కొన్నారని, తాను ఇంకా అంతటి వాడిని కాలేదని, ఆ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నానని అన్నారు. తనపై అభిమానవర్షాన్ని కురిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌తో పాటు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అతిథులుగా పాల్గొని మోహన్‌రెడ్డిని సత్కరించి, ఆయనను "నెల్లూరు విశ్వేశ్వరయ్య"గా కొనియాడారు.

ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా ఆర్కిటెక్ట్స్ & బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ముందుగా సినీగీతాలతో సంగీత విందునందించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు తోట నాగరాజు, పూర్వఅధ్యక్షుడు బాబూరావు, ఇతర బిల్డర్స్ రమణరావు, టి.వి.యస్.చలపతిరావు, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, లలితారామ్, విజయప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. నెల్లూరులో ఆర్కిటెక్చర్‌కి ఆద్యుడిగా పేరుతెచ్చుకుని అధునాతనమైన అపురూప డిజైన్లను నేటితరానికి అందిస్తూ "మాడరన్ మాంత్రికుడిగా" పిలిపించుకుంటున్న మన మోహన్‌రెడ్డికి "లాయర్" అభినందనలు.












1. బోగోలు మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న నగర మేయర్ మరియు డిప్యూటి మేయర్‌లు అజీజ్, ద్వారకానాథ్
2. సన్మానపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రస్తుత మరియు పూర్వ అధ్యక్షులు నాగరాజు, బాబూరావు
3. మాడరన్ మాంత్రికుడిని సత్కరిస్తున్న వాస్తు రామచంద్రరావు
4. తన చిరకాల మిత్రుడికి అభినందనలు తెలియజేస్తున్న ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com